



సీఐఐ పెట్టుబడుల సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు, విదేశీ రాయబారులు, ప్రతినిధులు



వేదికపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

ఆరంభం అదిరింది

భాగస్వామ్య సదస్సు తొలిరోజు సూపర్‌హిట్

- ఎటుచూసినా పారిశ్రామికవేత్తలు... కిక్కిరిసిన హాళ్లు
- రాష్ట్రం దశ, దిశ మారేలా భారీగా ఒప్పందాలు
- వారం రోజుల్లో లూలూ మాల్‌కు శంకుస్థాపన
- విశాఖలో రూ.2,500 కోట్లతో సెమీ కండక్టర్ పరిశ్రమ
- భోగాపురంలో ఏరో స్పేస్ సిటీ ఏర్పాటు
- మధురవాడలో రూ.500 కోట్లతో జలవిహార్



ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో లూలూ గ్రూప్ చైర్మన్, ఎండీ యూసుఫ్ అలీ, ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): **పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు రాష్ట్రం దశ, దిశ మార్చేలా తొలిరోజు విజయవంతమయ్యింది. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు భారీగా తరలిరావడంతో సదస్సు ప్రాంగణం కిక్కిరిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు ఉత్సాహంగా ముందుకురావడంతో తొలిరోజే ఏకంగా 360 ఒప్పందాలు జరిగాయి. శనివారం మరిన్ని సంస్థలతో ఎంవోయూలు జరగనున్నాయి. సదస్సు ఏర్పాట్లు, ఆతిథ్యం, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు చర్చించిన తీరుపై పారిశ్రామికవేత్తలు ప్రశంసలు కురిపించారు. సీఎం చంద్రబాబునాయుడు విజన్‌తో పెట్టుబడులు వరదలా వస్తున్నాయని, వీటితో ఆంధ్రప్రదేశ్ ముఖ చిత్రం మారుతుందని, యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని వారు తెలిపారు.**

నగరంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఊహించని సంఖ్యలో ఆహూతులు, పారిశ్రామికవేత్తలు తరలిరావడంతో సదస్సు సూపర్‌హిట్ అయింది. ప్లీనరీ ప్రారంభోత్సవంలో కుర్చీలు చాలక చాలామంది నిల్చొనే ప్రముఖుల ప్రసంగాలు ఆలకించారు. సదస్సు ద్వారా సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాలనేది ప్రభుత్వం లక్ష్యం కాగా తొలిరోజే 365 కంపెనీలు కలిపి రూ.8,26,668 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయి.

వారంలో లులూ శంకుస్థాపన

విశాఖపట్నంలో రూ.2,500 కోట్లతో సెమీ కండక్టర్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఆర్సిప్ టెక్నాలజీ ఎంఓయూ చేసుకుంది. లూలూ అధినేత యూసఫ్ అలీ మాట్లాడుతూ వారం రోజుల్లో షాపింగ్ మాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. దానిని మూడేళ్లలో పూర్తిచేస్తామన్నారు. అదేవిధంగా జలవిహార్ సంస్థ రూ.500 కోట్లతో మధురవాడలో హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుంది.

ఎటుచూసినా సందడే

సదస్సుకు దేశ, ... మిగతా 6వ పేజీలో

వైద్య రంగంలో ఏఐ పాత్ర కీలకం

- ఐదేళ్లలో గణనీయమైన మార్పులు
- సీఐఐ సదస్సులో అభిప్రాయపడిన వక్తలు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ భవిష్యత్తులో కీలకం కానుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా శుక్రవారం మూడో సెమినార్ హాలులో ఎనిమిదో ప్లీనరీ సెషన్ 'ఇండియా ప్రెసిషన్ మెడిసిన్ లీప్ హేమషింగ్ ఏఐ అండ్ జీనోమిక్స్ ఫర్ వికసిత్ భారత్ అంశంపై జరిగింది. పీడబ్ల్యుసీ ఇండియా హెల్త్ కేర్ లీడ్ అండ్ సీనియర్ పార్టనర్ డాక్టర్ రానా మెహతా మోడరేటర్‌గా వ్యవ హరించిన సదస్సులో వక్తలు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యరంగంలో డేటా విశ్లేషణ ముఖ్యమన్నారు. ఇందులో ఏఐ పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. జన్యుక్రమం విశ్లేషణ ద్వారా వ్యాధుల నిర్ధారణకు ఏఐ దోహదపడుతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో ఏఐ కారణంగా వైద్య, ఆరోగ్య రంగంలో వినూత్న మార్పులు చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు. అత్యాధునిక పరికరాల ద్వారా శస్త్ర చికిత్సలు జరుగుతాయన్నారు. కచ్చితమైన వైద్యం, జీనోమిక్స్‌తో విప్లవాత్మకమైన మార్పులు తథ్యమన్నారు. ఈ సెషన్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, సీఐఐ నేషనల్ కమిటీ ఆన్ హెల్త్ టెక్నాలజీ సీఈవో ప్రశాంత్ టాండన్, సీఐఐ నేషనల్ మెడికల్ టెక్నాలజీ ఫోరం ఎండీ గౌరవ్‌అగర్వాల్, అవెస్ట జెన్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ విల్లు మోర్వాల పాటిల్, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీడీవో డాక్టర్ రేచెస్ ఎల్లా, వెల్కమ్ మెడిటెక్ లిమిటెడ్ గ్రూప్ సీఎఫ్‌వో సుధీప్ ధరైవాలా, ఏఐజీ హాస్పిటల్స్ సీటీవో డాక్టర్ కింజల్ సక్సేనా పాల్గొన్నారు.

సదస్సుల కోసం కన్వెన్షన్ సెంటర్

- సీఎంకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సూచన

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సదస్సుల కోసం ప్రత్యేకించి కన్వెన్షన్ సెంటర్ నిర్మించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కేంద్ర వాణిజ్య శాఖామంత్రి పీయూష్‌గోయల్ సూచించారు. శుక్రవారం ఉదయం భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ ప్రసంగంలో సీఎం చంద్రబాబునాయుడు వచ్చే ఏడాది కూడా సీఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖ కేంద్రంగా నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది విశాఖ రావడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు వేసుకుని అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని దేశ, విదేశీ ప్రతినిధులకు సూచించారు. ఇదే వేదికపై అనంతరం మాట్లాడిన కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్‌గోయల్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేసిన సూచన బాగానే ఉందని, అయితే సదస్సుల నిర్వహణకు ఒక కన్వెన్షన్ సెంటర్ నిర్మించుకోవాలని చమత్కరించారు.

పారిశ్రామికవేత్తలకు ఏపీ స్వర్గధామం

- సీఐఐ సమ్మిట్‌లో పలువురు అభిప్రాయం

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ స్వర్గధామమని పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న భరోసాతో సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగుతోందన్నారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో ప్రభుత్వంతో పలు ప్రాజెక్టులకు ఎంవోయూలు చేసుకున్నామని వివరించారు.

రూ.650 కోట్లు పెట్టుబడి పెడుతున్నాం..

- అంజు వల్లభనేని, ప్రెసిడెంట్, ఐటీ సర్వ్ అలియన్స్ అమెరికా



అమెరికా అంతటా 2,500 చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలకు ఐటీ సర్వ్ అలియన్స్ ప్రాతినిధ్యం వహిస్తోంది. మంత్రి లోకేశ్ ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చాం. ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో విశాఖలో రూ.650 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ఎంవోయూ చేసుకున్నాం. 10 వేల ఉద్యోగాలు కల్పిస్తాం. కాపులుప్పాడలో పది ఎకరాలు కేటాయించారు.

పవర్ ఎలక్ట్రానిక్స్‌లో...

- సచిన్ శివపుర్, క్రెవాని టెక్నాలజీ సీఈవో, జర్మనీ



ఏపీలో రూ.200 కోట్లు పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు ఎంవోయూ చేసుకుంటున్నాం. దీని ద్వారా 500 మందికి ఉపాధి కల్పిస్తాం. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేలా ఏపీ ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణం కల్పించింది. జర్మనీ నుంచి మరిన్ని కంపెనీలను ఏపీకి తీసుకొస్తాం. ప్రభుత్వంతో ఆ దిశగానే చర్చలు సాగాయి.

ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డు రంగంలో రూ.350 కోట్లు

- వికాస్ అగర్వాల్, గుజరాత్



ప్రస్తుతం గుజరాత్‌లో ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డు పరిశ్రమ నిర్వహిస్తున్నాం. అటువంటి యూనిట్‌ను సుమారు రూ.350 కోట్లతో ఏపీలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. ఎక్కడ ఏర్పాటు చేసేది ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుంది. ఈ పరిశ్రమ ద్వారా 850 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశ అవసరాలకు ప్రస్తుతం ఇతర దేశాల నుంచి ప్రింటింగ్ సర్క్యూట్ బోర్డులను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ రంగంలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకునేలా పెట్టుబడులను పెట్టబోతున్నాం.

అమరావతి నమూనా



ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో శుక్రవారం ప్రారంభమైన పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు-2025 ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అమరావతి నమూనాను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ ఉన్నారు.

కిటకిటలాడిన ఎగ్జిబిషన్ స్టాల్స్

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో జరుగుతున్న సీఐఐ సదస్సు ప్రాంగణంలోని హాల్‌నంబర్-2లో ఏపీఐఐసీ, సీఐఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ సందర్శకులతో కిటకిటలాడింది. రాష్ట్ర ప్రభుత్వశాఖలు ఏపీ సీఆర్‌డీఏ, జీసీసీ, హస్తకళలు, లేపాక్షి, చేనేత, ఆయుష్ విభాగాలతో పాటు శ్రీసిటీ, రోబోటిక్ కెఫే వంటి సంస్థలు స్టాల్స్‌ను ఏర్పాటుచేశాయి. అయితే ఏపీసీఆర్‌డీఏ, అరకు కాఫీ, రోబోటిక్ కెఫే స్టాల్స్ వద్ద రద్దీ ఎక్కువగా కనిపించింది. అరకు కాఫీ స్టాల్ వద్ద కాఫీతోపాటు అనేక రకాల డ్రై కాఫీ గింజలను స్టాల్‌లో ఉంచడంతో వాటి గురించి విదేశీ ప్రతినిధులు ఆరా తీయడం కనిపించింది. సదస్సుకు హాజరైనవారంతా దాదాపుగా ఎగ్జిబిషన్‌ను సందర్శించడంతో స్టాళ్లు సందడిగా మారాయి.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్‌భరత్ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు అతనిని కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఆ తరువాత ఆయన వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సంస్థ పరిధిలో ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులపై ఇరువురూ చర్చించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తేజ్ భరత్



కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన నియోజకవర్గ బీజేపీ నాయకులు

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

- మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరానికి వచ్చిన ఆయన్ను పార్టీ కార్యాలయంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్రం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ కార్యకర్తలు వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడం లేదని చెప్పారు. ఈ విషయమై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సీరపు రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వసతి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీమునిపట్నం (రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓ అట్టాడ జయప్రద తెలిపారు. 'పాఠశాలలో వసతి కొరతతో ఇబ్బందులు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. పాఠశాలను సందర్శించి, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన భవనాలను విద్యా కమిటీ, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందితో సంప్రతించి ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.అసంపూర్తిగా ఉన్న గదిలో గ్రంథాలయం కాని, ప్రయోగశాల కాని ఏర్పాటు చేయవచ్చునని, మన బడి మన భవిష్యత్తు పథకం కింద వాటికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. నాడు - నేడు పథకం కింద చేపట్టిన పనుల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై రిటైర్డ్ హెచ్‌ఎం ప్రభాకర్‌ను ఫోన్‌లో ప్రశ్నించగా బిల్లులన్నీ అప్‌లోడ్ చేశారని, కానీ పనులకు సంబంధించిన పుస్తకం పోయిందని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇమంది రమేశ్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.కాగా పాఠశాలలో వసతి సమస్య, ఇతర సమస్యలను పరిశీలించడానికి జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు శనివారం పాఠశాలకు రానున్నట్టు తెలిసింది. ఈమేరకు ఉపాధ్యాయులు అన్ని రికార్డులు సిద్ధం చేస్తున్నారు.

కమనీయం..అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

మూడో వార్డు టీడీపీ అధ్యక్షుడిగా నరేంద్ర



మూడో వార్డు టీడీపీ నూతన కార్యవర్గం

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్ 3వ వార్డు తెలుగుదేశం పార్టీ నూతన కమిటీని శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా గొలగాని నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా కనకల అప్పలనాయుడు, కోశాధికారిగా కంచర్ల కామేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జలగడుగుల మురళి, నొల్లి చిన్న రమణ, రాజగిరి వెంకటరమణ, కార్యదర్శులుగా అప్పికొండ నూకరాజు, వియ్యపు పోతురాజు, శీరపు మహేష్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే బూత్, యూనిట్ ఇన్‌చార్జిలను కూడా నియమించారు.

ఐదో వార్డు అధ్యక్షుడిగా సత్యనారాయణ

కొమ్మాది : జీవీఎంసీ 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా రెండవసారి నాగోతి సత్యనారాయణ నియమితులయ్యారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన సేవలకు గాను అధిష్ఠానం గుర్తించి రెండవసారి ఆయన్ను అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. కార్పొరేటర్ మొల్లి హేమలత, సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను తదితరులు ఆయన్ను అభినందించారు.

అనాథ బాలలకు దంత వైద్య పరీక్షలు

సాగర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేసియస్ జస్ట్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అనాథ పాఠశాలల బాలలకు గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దంతాల సంరక్షణ, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.





స్విచ్ ఆన్ చేసి లైట్లను వెలిగించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మేయర్ పీలా, బీఆర్‌టీఎస్ రోడ్డులో విద్యుత్ వెలుగులు

బీఆర్‌టీఎస్ రోడ్డులో విద్యుత్ ధగధగలు

- రూ.1.37 కోట్లతో ఆధునిక లైట్లు ఏర్పాటు
- ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా, మేయర్ పీలా శ్రీనివాసరావు

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 98వ వార్డు బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్‌లో జీవీఎంసీ సాధారణ నిధులు రూ.1.37 కోట్లతో ఏర్పాటు చేసిన ఆధునిక లైటింగ్‌ను మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మోడ్రన్ లైటింగ్‌ను గోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు ఏర్పాటు చేయడంతో రోడ్డు అంతా వెలుగులతో నూతన శోభ సంతరించుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల నగరం శరవేగంగా అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ అప్పన్నస్వామి దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ఆధునిక లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు.సింహాచలం క్షేత్ర గొప్పతనం చాటిచెప్పే విధంగా ప్రత్యేక స్వాగత ద్వారాలు, తిరునామాలు, డిజైనింగ్ లైటింగ్‌కు కావలసిన నిధులను జీవీఎంసీ నుంచి కేటాయించేందుకు మేయర్ సమ్మతించారన్నారు. పెండింగ్ టీడీఆర్‌ల సమస్య కొలిక్కివచ్చిందని, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా నియమించిన కమిటీ అనుకూలమైన నివేదిక సమర్పించిందన్నారు. పంచగ్రామాల భూ సమస్య కూడా కోర్టు ముందుంచామని, త్వరలోనే 12 వేల కట్టడాల క్రమబద్ధీకరణ జరుగుతుందన్నారు. సింహాచలం దేవస్థానానికి రెగ్యులర్ ఈఓ లేకపోవడం వల్ల అనేక అంశాలు అపరిష్కారంగానే ఉన్నాయని, దేవాలయ సమస్యలను ముఖ్యమంత్రి, ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వరాహ నరసింహం, టీడీపీ నాయకులు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



భీమిలిలోని బాలసదనంలో వేడుకలు



తాటితూరు ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి

బాలల సంక్షేమం అందరి బాధ్యత

- బాలల దినోత్సవంలో వక్తల పిలుపు
- నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు

భీమునిపట్నం,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోనూ బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమునిపట్నంలోని చిన్నబజారు వీధిలో ఉన్న ప్రభుత్వ బాల సదనంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో జ్ఞానాన్ని పెంచుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అలాగే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ బంగారు భవిష్యత్‌కు చిన్నారులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో బాల సదనం సూపరింటెండెంట్ ఊర్మిళ, బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారిణి మమత, లీగల్ ఆఫీసరు అనిజ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా వేడుకలు జరి గాయి. హెచ్‌ఎం పొన్నగంటి రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుభకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. వాంబేకాలనీ, గణేశ్‌నగర్, మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్, పాత మధురవాడ మెట్ట, మధురవాడ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ వేడుకలు జరిగాయి. తొలుత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తాటితూరులో...

భీమునిపట్నం (రూరల్) : తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ నెహ్రూ దేశానికి చేసిన సేవల గురించి వివరించారు.

పీవీజీ రాజు సేవలు చిరస్మరణీయం



పీవీజీ రాజు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, విజయనగర సంస్థానాధీశులు దివంగత పీవీజీ రాజు నేటి తరానికి ఆదర్శనీయమని ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు అన్నారు. శుక్రవారం పీవీజీ రాజు 30వ వర్ధంతి పురస్కరించుకుని దేవస్థానానికి చెందిన నృశింహవనంలో ఉన్న ఆయన విగ్రహానికి అధికారులు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీవీజీ రాజు అనేక మందికి విద్యా దానం చేసిన ప్రదాత అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సీహెచ్‌వీ రమణ, డిప్యూటీ ఈఈ డీవీఎస్ రామరాజు (హరి), పర్యవేక్షణాధికారులు పి. సునీల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : విద్యా ప్రదాత పీవీజీ రాజు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. పీవీజీ రాజు వర్ధంతి పురస్కరించుకుని బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి నూకరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీగా, ఎమ్మెల్యేగా, విజయనగరం సంస్థానం రాజుగా ఆయన చేసిన దాతృత్వాలు ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయన్నారు. ఏయూకి 600 ఎకరాలు, కోరుకొండ సైనిక్ స్కూల్‌కు 1100 ఎకరాలు దానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



ఉత్సవంలో భాగంగా అమ్మవార్ల ఊరేగింపు

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో శుక్రవారపు తిరువీధి వైభవంగా నిర్వహించారు. ఉదయం సింహవల్లీ తాయారు, చతుర్భుజి తాయార్లకు సహస్రనామ కుంకుమార్చనలు జరిపారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పల్లకీలో ఉంచారు. తిరువీధి ఉత్సవంలో అష్టదిక్పాలకులకు పూజలు చేసి నివేదనలిచ్చారు.

పద్యాల పోటీలో విద్యార్థుల ప్రతిభ

తగరపువలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యోగి వేమన పద్యాల పోటీలో స్థానిక కృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థులు పలు బహుమతులను కైవసం చేసుకున్నారు. వేమన రాసిన పద్యాలాపనలపై పోటీలు నిర్వహించారు. ఇందులో పి. రాజ్యలక్ష్మి, ఆర్. రమ్య, బి. ఉషారాణి, బి. ప్రవల్లిక, కె. పుణ్యవతి బహుమతులు పొందారు.విజేతలను తెలుగు ఉపాధ్యాయుడు నాగార్జున, కళాశాల డైరెక్టర్ బి. నరసింగరావు అభినందించారు.

సాగర్‌నగర్ బీచ్‌లో ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం



సాగర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ బీచ్‌లో శుక్రవారం ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం లభ్యమైంది. ఇవి శీతాకాలంలో ఎక్కువగా నగరంలోని తీరానికి గుడ్లు పొదిగేందుకు సముద్ర జలాల నుంచి వస్తుంటాయి. ఈక్రమంలో మర పడవలు, ప్రత్యేక వలలు తగిలి మృత్యువాత పడుతుంటాయి. అలాగే సముద్రం కాలుష్యం వల్ల కూడా ఇవి ప్రాణాలకు కోల్పోతున్నాయి.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



భీమిలి శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు నూకరాజు, తదితరులు

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 58వ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత వక్తలు దేశ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, కళాసాహితీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ వర్మ, మాజీ కౌన్సిలర్ చురుకల రమణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు డి. ఈశ్వరరావు, చిలకా వెంకటరమణ, కనకల సన్యాసినాయుడు, లైబ్రేరియన్ మహేశ్ పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : నేటి బాలలే రేపటి పౌరులన్న పెద్దల మాట నిజం కావాలంటే బాలల్లో దేశభక్తి పెరగాల్సి ఉందని 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఆయన వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

టీటీడీ ఆలయంలో పవిత్రోత్సవాలు



స్వామివారి పల్లకీ సేవ

సాగర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తృతీయ పవిత్రోత్సవాలు శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరుమంజనం, ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు పవిత్ర సమర్పణ, సోమవారం సాయంత్రం 6 నుంచి 8 వరకు పూర్ణాహుతి నిర్వహించనున్నట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు.అలాగే ఉత్సవాల అన్ని రోజులు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆగమ అడ్వైజర్లు, టీటీడీ లోకల్ బాడీ సలహాదారుడు పట్టాభిరామ్, సూపరింటెండెంట్ వెంకటరమణ, వేద పండితులు, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిశోర్ పాల్గొన్నారు.

కీలక ఒప్పందాలతో ఉద్యోగాల వెల్లువ

- దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఐఐ భాగస్వామ్య సదస్సులో తొలిరోజు వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ ఒప్పందాలు ద్వారా కోట్లాది రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వస్తుండగా, లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న పలు సంస్థల ప్రతినిధులను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పలకరించగా వివరాలను వెల్లడించారు.

ఏపీ యువతలో నైపుణ్యానికి కొదవలేదు

- ఎస్.శివకుమార్, టెట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, బెంగళూరు



ఏపీలో నైపుణ్యం గల యువతకు కొదవలేదు. సరికొత్త ఆవిష్కరణలు సృష్టించే దిశగా మా కంపెనీ వివిధ రంగాల్లో యువతకు శిక్షణ, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. కుప్పంలో ప్రయోగాత్మకంగా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సీఐఐ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకున్నాం. భవిష్యత్తులో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ ప్రారంభిస్తాం. ఐదేళ్లలో పది వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

20 లక్షల మందికి ఉపాధి

- డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ బోర్డు డైరెక్టర్, విజయవాడ



సీఐఐ సమ్మిట్‌తో రూ.పది లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల మందికి ఉపాధి లభించనుంది. గతంలో అమర్‌రాజా వంటి కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. సీఎం చంద్రబాబు విజన్ ఉన్న వ్యక్తి. ఇంటికో వ్యాపారవేత్తను తయారుచేయాలనే లక్ష్యం ఇలాంటి సమ్మిట్‌లతో నెరవేరుతుంది. ఇందులో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది.

పరిశ్రమల ఏర్పాటుకు మంచి తరుణం

- ఎంఎన్ రావు, శ్రీకరి బిజినెస్ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్



ఏపీలో అపారమైన సహజ వనరులు ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైనది. మా సంస్థ పారిశ్రామిక, పెట్టుబడిదారులకు అవసరమైన ప్రాజెక్టులను సిద్ధం చేస్తుంది. అమరావతి కేంద్రంగా సంస్థ ఏర్పాటుకు ఎంఓయూ చేసుకుంటున్నాం. పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా సంస్థ కార్యకలాపాలు ఉంటాయి.

రూ.2,500 కోట్లతో విశాఖలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ

- వెంకట సింహాద్రి, ఎండీ, ఆసిప్ టెక్నాలజీ



రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. రూ.2,500 కోట్లతో పెట్టుబడి పెట్టనున్నాం. మొదటి ఫేజ్‌లో రూ.2,000 కోట్లు పెట్టి 1,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. రెండో దశలో మిగిలిన రూ.500 కోట్లను పెట్టుబడి పెడతాం. దక్షిణ భారతదేశంలో ఈ తరహా పరిశ్రమ ఏర్పాటుకావడం ఇదే తొలిసారి. దీన్ని విశాఖలో ఏర్పాటు చేయబోతున్నాం. కేంద్ర ప్రభుత్వం, మైటీ రూపొందించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌లో భాగంగా పది ప్రాజెక్టులకు రూ.76 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ పది ప్రాజెక్టుల్లో మాది ఒకటి. దీనిని సీఎం చంద్రబాబు చొరవతో విశాఖలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇప్పటివరకూ సెమీ కండక్టర్ల కోసం తైవాన్, కొరియా, జపాన్ దేశాలపై ఆధారపడుతూ వస్తున్నాం. ఇకపై మనమే తయారు చేసుకోబోతున్నాం.

ఉప రాష్ట్రపతికి సాదర స్వాగతం, ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడానికి విచ్చేసిన ఉప రాష్ట్రపతి సీ.పి.రాధాకృష్ణన్‌కు శుక్రవారం ఉదయం కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తదితరులు సాదర స్వాగతం పలికారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న అనంతరం శుక్రవారం రాత్రి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తిరుగు ప్రయాణమయ్యారు. ఐఎన్ఎస్ డేగ ఎయిర్‌పోర్టులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చి ఇతర అధికారులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



షేక్ బషీర్ (ఫైల్)

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం తాటిచెట్లపాలెంలో భవనంపై నుంచి పడి అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముస్లిం తాటిచెట్లపాలెంకి చెందిన షేక్ నాగూర్ మీరా కుమారుడు షేక్ బషీర్ (30) లైటింగ్ పనులు చేస్తుంటాడు. డబ్బులు ఇంటికి ఇవ్వకుండా మద్యం తాగేవాడు. ఒక్కోసారి రాత్రిపూట ఇంటికి వెళ్లేవాడు కాదు. గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పనికి వెళ్లి వస్తానని తండ్రికి చెప్పి బయటకు వచ్చిన బషీర్ రాత్రి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం పోర్టు ఆసుపత్రి ఎదురు రోడ్డులోని ఓ బిల్డింగ్ పక్కన యువకుడు చనిపోయి ఉన్నట్లు షేక్ నాగూర్ మీరాకు స్థానికులు తెలిపారు. దీంతో అక్కడికి వెళ్లి తన కుమారుడు మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాంభట్ల శ్రీనివాస్ సంఘటన స్థలానికి సిబ్బందితో వెళ్లి విచారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. బషీర్ రాత్రి ఎవరితోనో కలిసి మద్యం తాగాడని, మృతుడి కంటిపై తీవ్ర గాయం ఉండటం, కాలు, చేతులు విరిగి ఉండటంతో ఎలా మరణించి ఉంటాడోనని పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆరంభం అదిరింది

... 5వ పేజీ తరువాయి

విదేశాల నుంచి భారీగా అతిథులు తరలి వచ్చారు. అధికారులు పది రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. వాహన రాకపోకల నుంచి అతిథి మర్యాదల వరకు అన్నీ సజావుగా సాగాయి. వచ్చిన వారికి రుచికరమైన వంటకాలు వడ్డించారు. బీ టు బీ సమావేశాలు, సెషన్లు నిర్వహించడానికి ఏర్పాటు చేసిన వేదికలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఏపీ పెవిలియన్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

బాబు, లోకేశ్ వేర్వేరుగా సమావేశాలు

సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఇద్దరూ వేర్వేరుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఒప్పందాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తో కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పియూష్ గోయల్ పక్కనే ఉండి పలు ప్లీనరీల్లో పాల్గొన్నారు. ఇద్దరూ కలసి స్పేస్, డ్రోన్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరికీ డ్రోన్ అవసరం అవుతుందని, ఇది ప్రధాని మోదీ విశ్వాసమని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త సోమనాథ్ మాట్లాడుతూ స్పేస్ సిటీ ఏర్పాటు సీఎం చంద్రబాబు కల అని, ఇది ఇలా సాధ్యమైందని పేర్కొన్నారు.

పర్యాటకంలో 100 ఒప్పందాలు

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం రాత్రి సదస్సు ప్రాంగణాన్ని సందర్శించి తొలిరోజు సదస్సు విజయవంతమైనందుకు హర్షం వ్యక్తం చేశారు. పర్యాటకంలో 100 ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించనున్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక వెనకడుగు వేసిన పారిశ్రామికవేత్తలంతా తాజాగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు.

విశాఖ-కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమలై వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖ-కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

విశాఖ-కొల్లాం : 08539 నంబరు గల రైలు ఈ నెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 1.45 గంటలకు కొల్లాం చేరుతుంది.

కొల్లాం-విశాఖ : 08540 నంబరు గల రైలు ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 5 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటి రోజు (గురువారం) రాత్రి 11 గంటలకు విశాఖ చేరుతుంది.

ఈ సర్వీసులు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కోచ్‌లతో దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఇరోడ్, తిరుపూర్, పొడనూర్, పాలక్కాడ్, త్రిచూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్యాం, తిరువెల్ల, చెంగన్నూర్, కయంకులమ్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ప్రశాంతి, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు థర్డ్ ఏసీ కోచ్

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ మీదుగా నడిచే భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక అదనపు థర్డ్ ఏసీ కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463)కు ఈ నెల 17 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలోని బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు (18464) ఈ నెల 18 నుంచి డిసెంబరు 1 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ అందుబాటులో ఉంటుంది.

అలాగే భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు (22879) ఈ నెల 22 నుంచి 29 వరకు, తిరుగు ప్రయాణంలోని తిరుపతి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌కు (22880) ఈ నెల 23 నుంచి 30 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేస్తారు.

23న 'గురు వైభవం' వేదాంత శ్రవణం

డాబాగార్డెన్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో 'గురు వైభవం'పై తెలుగులో వేదాంత శ్రవణం నిర్వహిస్తున్నట్టు పెంట వాశిష్ట కార్తికేయ శర్మ తెలిపారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. వేద, శాస్త్ర పండితుడు పేరి రవికుమార్ ఈ అంశంపై ప్రవచనమిస్తారన్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ).
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య, లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 60, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 58, బీరకాయలు 58, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

ప్రపంచం చూపు.. విశాఖ వైపు

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సదస్సు ప్రాంగణంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

సిరిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీఐఐ భాగస్వామ్య సదస్సుతో ప్రపంచమంతా విశాఖ వైపే చూస్తోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. తొలి రోజు సీఐఐ సదస్సులో పాల్గొన్న ఆయన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఏపీ రాష్ట్ర అభివృద్ధికి అద్దం పట్టేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ సమ్మిట్‌లో పెట్టుబడుల జాతర జరుగుతోందని, ఇవన్నీ కార్యరూపంలోకి వస్తే, ఏపీలో నిరుద్యోగం దూరకానుందన్నారు. సదస్సుకు ముందు రోజునే విశాఖలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 5 రంగాల్లో 35 సంస్థలతో రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకోవటం, సమ్మిట్ సత్ఫలితాలను ఇస్తోందనడానికి నిదర్శనంగా చెప్పవచ్చాన్నారు. గత వైసీపీ పాలనలో కొనసాగిన కక్షసాధింపు చర్యలతో రాష్ట్రానికి వచ్చిన అనేక పారిశ్రామిక సంస్థలు పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విజనరీ లీడర్ ముఖ్యమంత్రిగా ఉండడంతో పారిశ్రామిక వేత్తలు ఏపీ వైపు చూస్తున్నారన్నారు. అందువల్లే పెట్టుబడిదారులు రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. విశాఖ సమ్మిట్ విజయవంతంగా సాగుతుండడం అందరి సమన్వయ ఫలితమేనన్నారు.

దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు

» లీగల్ సెల్ అథారిటి కార్యదర్శి సన్యాసినాయుడు



సమావేశంలో ప్రసంగిస్తున్న జస్టిస్ సన్యాసినాయుడు

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మన సంకల్పం దృఢమైనదైతే మనం దేనినైనా సాధించగలుగుతామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటి కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. జాతీయ చిల్డ్రన్స్ డే సందర్భంగా శుక్రవారం చినగదిలిలోని ప్రభుత్వ బాలురగృహంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత భారత్ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు అందరూ తల్లిదండ్రులతో పాటు ఇతరులనూ గౌరవించడాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎదగడం, తెలుసుకోవడం, నేర్చుకోవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అప్పుడే పిల్లల్లో వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సూపరింటెండెంట్ రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ రామలక్ష్మి, వైద్యులు జీవన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు కె.వెంకటలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

అలాగే దీన్‌దయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో చిల్డ్రన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సన్యాసిరావు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి సమాజ నిర్దేశకులు నేటి బాలలన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర సోషల్ వెల్ఫేర్ వారు అందించిన నోటు పుస్తకాలు, ప్యాడ్స్ తదితర స్టేషనరీ సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పరిశీలన గృహం పర్యవేక్షణాధికారి షణ్ముఖరావు, సూపరింటెండెంట్ అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు. చినగదిలిలోని ప్రభుత్వ బాలికల పరిశీలన గృహంలో కూడా బాలలవారోత్సవ ప్రారంభ వేడుకలను నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం ఏర్పరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి విద్యా దశ నుంచి సేవా భావం అలవరచుకోవాలని, తద్వారా చక్కని వ్యక్తిత్వం గల వారిగా తయారవుతున్నారని తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తోటగరువులో గత వారం నుంచి ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథం ఉన్న విద్యార్థులు సద్భావన కలిగిన వారై ఉంటారన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరం వంటివి నిర్వహించడం ద్వారా సమాజంతో మమేకమయ్యే అవకాశం లభిస్తుందని, విద్యార్థుల జీవితంలో మున్ముందు ఇదెంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ మూర్తి,ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారి ఎస్.భాస్కరరావు తదితరులతో పాటు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడిగా డాక్టర్ శ్రీనివాస్



డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడిగా డాక్టర్ సజ్జా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు పశువైద్య శాలలో పని చేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న బ్రెజిల్‌వాసులు



ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకుడు

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీఐఐ సదస్సుకు వచ్చిన స్వదేశ ప్రముఖులతో పాటు ముగ్గురు బ్రెజిల్ దేశస్తులు కూడా వరాహలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. నుదుట తిలకం దిద్దుకుని సింహాద్రినాథుడ్ని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో జరిగిన స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణంలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదు

జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు



భీమారావును సన్మానిస్తున్న కార్యవర్గ ప్రతినిధులు

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు పోరాటం చేయాలని జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.డి. ప్రసాదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమిలి తాలూకా ప్రభుత్వ పింఛనుదారుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయడం లేదని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను కార్పొరేట్ ఆస్పత్రులు అంగీకరించడం లేదని చెప్పారు. పీఆర్సీ వేయలేదని, ఇతర బకాయిలను చెల్లించడం లేదని చెప్పారు. వీటి సాధనకు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం భీమిలి తాలూకా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

నూతన అధ్యక్షుడిగా తట్టికోట భీమారావు, ప్రధాన కార్యదర్శిగా కనకల సన్యాసినాయుడు, కోశాధికారిగా పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భీమారావును నూతన కార్యవర్గ ప్రతినిధులు సన్మానించారు.


జనసేన పార్టీలో 20 మంది చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన భీమిలి ఇన్‌చార్జి సందీప్

ఎండాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నాలుగో వార్డుకు చెందిన పలు పార్టీల నుంచి 20 మంది కార్య కర్తలు జనసేన పార్టీలో చేరారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా బాలు, ఒమ్మిడి రాజు, కె. ప్రసాద్, నరేశ్, రామకృష్ణ, నాగోతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ప్రతాప్ రుద్ర

పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర విచ్చేసిన మానసిక దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక అవసరాల పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ మధు, ఉపాధ్యాయులు సురేష్, పద్మ, సరళ, స్వాతి, జోగులు, రాజు, చిన్నతల్లి, శైలజ, భవాని, పిల్లలు తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు నీట్‌లో ప్రత్యేక శిక్షణ

» రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 109 గురుకులాల్లో అమలు
» 120 మంది చొప్పున బాలబాలికలకు శిక్షణ
» రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవిత



విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి తినిపిస్తున్న మంత్రి సవిత

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలె ఏపీ బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో విద్యార్థులకు నీట్ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. అడివివరంలోని మహాత్మా జ్యోతిబా పూలె ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సవిత మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇందులో భాగంగా గురుకుల విద్యార్థులకు మంచి నాణ్యత కలిగిన యూనిఫారాలు, పుస్తకాలు, రుచికర, పోషక విలువలతో కూడిన భోజన సదుపాయం, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తాజాగా సీఎం చంద్రబాబు వినూత్నంగా ఆలోచించి గురుకుల విద్యార్థులు కూడా ఇతరులతో సమానంగా ఇంజనీరింగ్, మెడిసిన్‌లలో సులభంగా ప్రవేశం పొందాలని కోరుకుంటున్నారని, అందుకు తగినట్టుగా రాబోయే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 109 గురుకులాల నుంచి 120 మంది బాలురు, 120 మంది బాలికలను ఎంపిక చేసి వాళ్లకు నీట్, ఎంసెట్‌లలో శిక్షణ అందించాలని నిర్ణయించామన్నారు. ఇందు కోసం బాలురకు అడివివరం గురుకుల పాఠశాల, అనంతపురం గురుకుల పాఠశాలను బాలికల కోసం ఎంపిక చేశామన్నారు. ఇప్పటివరకు ఉన్న వసతి సౌకర్యాలను వినియోగించుకొని శిక్షణ ఇస్తామన్నారు.

అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్‌ను కార్యదర్శి సత్యనారాయణతో కలిసి కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమామోహిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రచారం పీక్.. పరిశుభ్రత వీక్

» డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో కానరాని స్వచ్ఛత



డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాల మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలు

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కళాశాల మైదానం ప్రహరీ పక్కన గుబురుగా చెట్లు, ముళ్ల పొదలతో అడవిని తలపిస్తోంది. కళాశాలలో వారానికోసారి స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత హీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. రెండు పిచ్చి మొక్కలు లాగి ఫోటోలకు ఫోజులిచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. క్రమం తప్పకుండా ప్రతి వారం కళాశాలలో స్వచ్ఛత మీద ఒక కార్యక్రమం ఉంటుంది. ప్రచారం పీక్‌లో ఉంటుంది కాని పరిశుభ్రతే చాలా వీక్‌గా ఉందని వాకర్స్ ఎద్దేవా చేస్తున్నారు. కాగా, కృష్ణా కళాశాల ప్రాంగణంలో డిగ్రీ, జూనియర్, వొకేషనల్ మూడు కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో సుమారు 4 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారంతా ఒక్క రోజు స్వచ్ఛభారత్ చేస్తే పిచ్చి మొక్కలే కనిపించవు. కళాశాలల మధ్య అంతర్గత విభేదాలతో 'ఎవరికి వారే.' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కళాశాల పరిశుభ్రత గాలి కొదిలేసి స్వచ్ఛభారత్ అంటూ మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మైదానం, ఇతర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. మొక్కల వల్ల కీటకాలు, పాములు వచ్చే ప్రమాదముందని విద్యార్థులు భయయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా కళాశాల యాజమాన్యాలు కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టాలని వాకర్స్, విద్యార్థులు కోరుతున్నారు.

20వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా శివారెడ్డి



పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా కంభాపు శివారెడ్డి నియమితులయ్యారు. ఎమ్మెల్యే లు వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి పర్యవేక్షణలో 20వ వార్డు కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షుడిగా కంభాపు శివారెడ్డి, ఉపాధ్యక్షుడుగా బొట్టా నిరంజన్ సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలకొల్లు మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.మంగన్న, ఎం.సీతన్న రెడ్డి, జి.అప్పలరెడ్డి, కార్యదర్శులుగా ఎ.శ్రీనివాసరావు, బి.గోవింద రెడ్డి, రాచకొండ దశరథరామయ్య, కోశాధికారిగా బీవీకే సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. ఎన్నికైన వారినిఎమ్మెల్యే రామకృష్ణ బాబు, టీటీడీ స్థానిక సలహా మండల చైర్మన్ చోడే వెంకట పట్టాభిరామ్, పోతన్న రెడ్డి తదితరులు అభినందించారు.

నగరంపాలెం యువకుడికి ఏయూ డాక్టరేట్

మధురవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం యువకుడు ఇలిపిల్లి అనిల్‌కుమార్‌కు ఏయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమేరకు వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ శుక్రవారం ఆయనకు తన కార్యాలయంలో పట్టా అందజేశారు. అనిల్‌కుమార్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్య ఎం.గోపీచంద్‌నాయక్ పర్యవేక్షణలో మల్టీ ఆబ్జెక్టివ్ అప్రోచ్ ఫర్ ఆప్టిమల్ ఎలకేషన్ ఆఫ్ డీజీ ఇన్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా..

17న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

» ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, భద్రతను హరిస్తూ పని గంటలు పెంచుతూ, కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బ్రోచర్‌ను ప్రదర్శించారు. ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలులో జరుగుతున్న జాప్యాన్ని భరించలేని పాలకులు, మేడే ద్వారా సాధించుకున్న రోజుకు 8 గంటల పనిని ఓటీతో కలిపి 12 గంటల పని దినంగా పెంచుతూ చట్టాలు మారుస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం 2025 సెప్టెంబరు 19న అసెంబ్లీలో ఆమోదించి, చట్ట సవరణ చేస్తూ నవంబరు 3న జీవో 23 విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 12 సంవత్సరాలుగా 67 షెడ్యూల్ రంగాల కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను ఉచితంగా కార్పొరేట్ వర్గాలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. డేటా సెంటర్ ద్వారా లక్షా 85 వేల ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు, లోకేశ్, ఎంపీ శ్రీభరత్ ప్రచారం చేస్తున్నారని, దాని వల్ల మంచినీరు, విద్యుత్ కొరత, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ నెల 17న అన్ని జిల్లాల్లో ధర్నాలు చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, నాయకులు బి.గీత, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, బి.భూషణం, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామకృష్ణ, సిహెచ్ చిన్నారి, కె.శ్రీనివాసరావు, గుర్రప్ప, కె.రామారావు, వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణం చక్కని అనుభూతి కలిగించాలి

» సిబ్బందికి ఏడీఆర్ఎం రామారావు సూచన



ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సర్వీసెస్ సిబ్బందికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఏడీఆర్ఎం రామారావు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సదుపాయాల నిర్వహణలో చిత్తశుద్ధి పాటించాలని వాల్తేరు రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ కె.రామారావు పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంపై శుక్రవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సర్వీసెస్ (వోబీహెచ్ఎస్) సూపర్‌వైజర్లు, సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం మాట్లాడుతూ రైలు ప్రయాణికులకు అందించే సేవల మెరుగుదలకు దృష్టి సారించాలన్నారు. రైళ్లలో పరిశుభ్రత పాటిస్తూ, ప్రయాణికులతో మర్యాదపూర్వక విధానాన్ని అవలంబించాలని సూచించారు. వారికి మంచి ప్రయాణ అనుభూతి కలిగేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

బిహార్‌లో గెలుపుతో బీజేపీ సంబరాలు



పరశురామ్‌రాజుకు మిఠాయి తినిపిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయదుందుభి మోగించి, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆ పార్టీలు శుక్రవారం నగరంలో సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం నగర బీజేపీ కార్యాలయంలో బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ పరశురామ్‌రాజు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర 20 పాయింట్స్ చైర్మన్ లంక దినకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోలాహలంగా పాల్గొని బాణసంచా పేల్చిమిఠాయిలు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు.


పౌరగ్రంథాలయంలో పఠన విభాగాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కె.సి.రెడ్డి



బాల సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణమ్మ, విశాలాక్షి, ఇతర ప్రముఖులు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న కార్యదర్శి కుమార్‌రాజా

పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదు

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.సి.రెడ్డి వ్యాఖ్య
- పోటీ ప్రపంచంలో విద్యార్థులు నెగ్గాలంటే గ్రంథాలయాన్ని నమ్ముకోండి

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం ఓ జ్ఞాననిధి. విజ్ఞాన సముపార్జనకు, ఉద్యోగార్జనకు దోహదపడుతుంది. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే విద్యార్థులు గ్రంథాలయాన్ని నమ్ముకోవాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ నాలెడ్జి టెక్నాలజీస్ పూర్వ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ప్రారంభమైన 58వ గ్రంథాలయ వారోత్సవాలను ప్రొఫెసర్ కె.సి. రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్‌లో ఏ సమాచారమైనా లభిస్తుందని నమ్ముతున్న పరిస్థితులు, అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధతో గ్రంథాలయాల అవసరం ఉందా? అనే ప్రశ్న తలెత్తుతుందని, అయితే పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదని ఆయన స్పష్టంచేశారు. పౌరగ్రంథాలయంలో జ్ఞానార్జనకు తగిన వాతావరణం ఉందని, ఇక్కడి సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ గ్రంథాలయం ఆదరణ పొందడానికి కారణం పాలక వర్గం, సిబ్బంది శ్రద్ధ, అంకితభావమేనని ప్రశంసించారు. వారోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు కె.సి.రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. గ్రంథాలయ కమిటీ ఉపాధ్యక్షుడు టి.ఎస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ ఇక్కడ అందిస్తున్న సేవలను, ఇక్కడ పలు విభాగాలను వివరించారు. బాలల దినోత్సవం సందర్భంగా బాల బాట పత్రిక సంపాదకురాలు కె.ఎస్.వి. రమణమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. బాల సాహిత్యంపై డాక్టర్ డి.వి.సూర్యారావు, చల్లా రాంబాబు, దామరాజు విశాలాక్షి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రచయితలు, కవులు, విమర్శకులు, సాహితీవేత్తలు మేడా మస్తాన్‌రెడ్డి, లైబ్రరీ అడ్మినిస్ట్రేటర్ వరలక్ష్మి, లైబ్రేరియన్ దుర్గారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ..

మహారాణిపేట: గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా శుక్రవారం సూర్యాబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జ్ఞానాన్ని అందించేవి పుస్తకాలేనని, అందువల్ల బాల్యం నుంచే తమ గ్రంథాలయాలను సందర్శించి విస్తారమైన పుస్తక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ నెల 20 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.తిరుమల కుమారి, కేవీఎస్ నరసింహం, పీవీఎన్ రాజు, రాజేంద్రవర్మ, యోగానంద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఎంతో మేలు

అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల మేధస్సు పెరుగుదలకు పుస్తకపఠనం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి, సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డా.ఉమాగాంధీ, ఎస్.అప్పలరెడ్డి, గ్రంథాలయ అధికారి పీవీఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ పితామహుడు డా.ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి ప్రసన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.


సెయింట్‌జోసెఫ్ కళాశాలలో పుస్తక ప్రదర్శన

పుస్తకాలే మంచి నేస్తాలు

మురళీనగర్: గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడం దినచర్యగా మార్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీఎస్.మూర్తి సూచించారు. విద్యార్థులకు పుస్తకాలే మంచి నేస్తాలవుతాయని పేర్కొన్నారు. మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వరప్రసాద్, పివిఎస్.రాజు, యు.రాజ్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

కీలక ఒప్పందాలతో ఉద్యోగాల వెల్లువ

దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఐఐ భాగస్వామ్య సదస్సులో తొలిరోజు వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ ఒప్పందాలు ద్వారా కోట్లాది రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వస్తుండగా, లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న పలు సంస్థల ప్రతినిధులను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పలకరించగా వివరాలను వెల్లడించారు.

ఏపీ యువతలో నైపుణ్యానికి కొదవలేదు



ఏపీలో నైపుణ్యం గల యువతకు కొదవలేదు. సరికొత్త ఆవిష్కరణలు సృష్టించే దిశగా మా కంపెనీ వివిధ రంగాల్లో యువతకు శిక్షణ, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. కుప్పంలో ప్రయోగాత్మకంగా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సీఐఐ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకున్నాం. భవిష్యత్తులో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ ప్రారంభిస్తాం. ఐదేళ్లలో పది వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

- ఎస్.శివకుమార్, టెట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, బెంగళూరు

20 లక్షల మందికి ఉపాధి..



సీఐఐ సమ్మిట్‌తో రూ.పది లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల మందికి ఉపాధి లభించనుంది. గతంలో అమర్‌రాజా వంటి కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. సీఎం చంద్రబాబు విజన్ ఉన్న వ్యక్తి. ఇంటికో వ్యాపారవేత్తను తయారుచేయాలనే లక్ష్యం ఇలాంటి సమ్మిట్‌లతో నెరవేరుతుంది. ఇందులో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది.

- డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ బోర్డు డైరెక్టర్, విజయవాడ

పరిశ్రమల ఏర్పాటుకు మంచి తరుణం



ఏపీలో అపారమైన సహజ వనరులు ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైనది. మా సంస్థ పారిశ్రామిక, పెట్టుబడిదారులకు అవసరమైన ప్రాజెక్టులను సిద్ధం చేస్తుంది. అమరావతి కేంద్రంగా సంస్థ ఏర్పాటుకు ఎంవోయూ చేసుకుంటున్నాం. పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా సంస్థ కార్యకలాపాలు ఉంటాయి.

-ఎంఎస్ రావు, శ్రీకరి బిజినెస్ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్

అమరావతికి అండగా

మలేసియాలోని 4 లక్షల మంది భారతీయుల కోరిక మేరకు అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా అమరావతిలో రూ.200 వందల కోట్లతో టవర్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకుంటున్నాం. అమరావతి అభివృద్ధికి ప్రపంచంలోని తెలుగు వారంతా కలసి రావాల్సిన అవసరం ఉంది. మలేసియా తెలుగు సంఘం వినతి మేరకు తొమ్మిది మంది సభ్యులం సమ్మిట్‌లో పాల్గొన్నాం.

- తువాన్ గణపతిరావు, మలేసియా ఎంపీ

ఏపీలో పరిశ్రమల ఏర్పాటుపై అధ్యయనం

విశాఖ మాదిరిగా తొయామా నగరం సముద్ర తీర ప్రాంతం. ఈ నగరంలో ఔషధ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యావసర వస్తువులు, ఇతర డొమెస్టిక్ అవసరాలకు తగ్గ పరిశ్రమలు అధికంగా జపాన్‌లో ఉన్నాయి. అటువంటి పరిశ్రమలు ఏపీలో పెట్టేందుకు ఉన్న అవకాశాలు అధ్యయనం చేయడానికి సదస్సుకు వచ్చాం. ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలో అక్కడి పరిశ్రమలకు చెందిన ఏపీకి వచ్చేలా చొరవ తీసుకుంటాం.

- తనోవెరా, తోయమా, జపాన్

రూ.2,500 కోట్లతో విశాఖలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ



రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. రూ.2,500 కోట్లతో పెట్టుబడి పెట్టనున్నాం. మొదటి ఫేజ్‌లో రూ.2,000 కోట్లు పెట్టి 1,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. రెండో దశలో మిగిలిన రూ.500 కోట్లను పెట్టుబడి పెడతాం. దక్షిణ భారతదేశంలో ఈ తరహా పరిశ్రమ ఏర్పాటుకావడం ఇదే తొలిసారి. దీన్ని విశాఖలో ఏర్పాటు చేయబోతున్నాం. కేంద్ర ప్రభుత్వం, మైటీ రూపొందించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌లో భాగంగా పది ప్రాజెక్టులకు రూ.76 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ పది ప్రాజెక్టుల్లో మాది ఒకటి. దీనిని సీఎం చంద్రబాబు చొరవతో విశాఖలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇప్పటివరకూ సెమీ కండక్టర్ల కోసం తైవాన్, కొరియా, జపాన్ దేశాలపై ఆధారపడుతూ వస్తున్నాం. ఇకపై మనమే తయారు చేసుకోబోతున్నాం.

- వెంకట సింహాద్రి, ఎండీ, ఆసిప్ టెక్నాలజీ

న్యూరాలజీ సమస్యలపై అవగాహన సదస్సు


డాక్టర్ ఎస్.గోపికి జ్ఞాపిక అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎపిలెప్సీ దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి ఆధ్వర్యంలో శుక్రవారం న్యూరాలజీ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోగులకు ఫిట్స్, న్యూరాలజీ సమస్యలు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, అధునాతన చికిత్స విధానం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, న్యూరాలజీ వైద్యులు డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.సతీష్ కుమార్, డాక్టర్ సిహెచ్ సుష్మా, డాక్టర్ మనోజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేడియో థెరపీ ఆవిర్భావ దినోత్సవం

కేజీహెచ్ రేడియో థెరపీ విభాగం ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విభాగాధిపతులు, వైద్యులను సత్కరించారు. సూపరింటెండెంట్ డా ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ ఎస్.వెంకటపతిరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూరీలో వైద్య విద్యార్థుల ప్రతిభ

పూరీలో నిర్వహించిన శిశు శస్త్రచికిత్స వైద్యనిపుణుల సదస్సులో క్విజ్‌లో డాక్టర్ తేజా శ్రీనివాస్, పరిశోధనా పత్ర విభాగంలో డాక్టర్ సుష్మితా, డాక్టర్ వంశీసూర్యాలు ప్రతిభ చాటుకోవడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అధ్యాపకులు అభినందించారు.

కోలుకున్న రోగి ఉదారత

తనకు మెరుగైన వైద్యం అందించి స్వస్థత చేకూర్చినందుకు మచిలీపట్నంకు చెందిన కొక్కిలిగడ్డ యాబ్ కేజీహెచ్‌కు రూ. 20 వేల విలువైన 4 వీల్‌ఛైర్లు, బీపీ పరీక్షించే రెండు పరికరాలను అందించి ఉదారత చాటారు. ఇతరుల మేలుకోరే ఆయన కృతజ్ఞతాభావాన్ని ఆసుపత్రి వైద్య వర్గాలు అభినందించాయి.

పోస్టల్ టీటీ చాంప్స్ పశ్చిమ బెంగాల్, తెలంగాణ



సింగిల్స్ మెన్, విమెన్ విన్నర్లు ఆకాష్ నాథ్, పౌలమి దాస్‌లకు జ్ఞాపికలు అందజేస్తున్న చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ నిర్వహించిన 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నీ మహిళల విభాగంలో పశ్చిమ బెంగాల్, పురుషుల విభాగంలో తెలంగాణ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. గుజరాత్, తమిళనాడులు రన్నరప్‌గా నిలిచాయి. సింగిల్స్ ఈవెంట్‌లో విన్నర్‌గా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాష్ నాథ్, రన్నరప్‌గా కె.పవన్‌కుమార్ (తెలంగాణ)...మహిళల కేటగిరీలో పౌలమి దాస్ (పశ్చిమ బెంగాల్) విన్నర్, తమిళనాడుకు చెందిన అభినయ రమేష్ రన్నరప్ స్థానాలను సాధించారు. పురుషుల డబుల్స్‌లో ఆకాశ్‌నాథ్-సౌరవ్ (వెస్ట్ బెంగాల్) విన్నర్‌గా, పవన్-ఉమేష్ (తెలంగాణ) రన్నరప్‌గా నిలిచారు. మహిళల డబుల్స్‌లో సయని-సంగీత (పశ్చిమబెంగాల్), శైలు నూర్‌బాషా-శ్రీలక్ష్మి (ఆంధ్ర)...మిక్స్‌డ్ డబుల్స్‌లో వివి.వాల-దివ్య గోయల్ (గుజరాత్), పౌలమిదాస్-ఆకాశ్ (పశ్చిమ బెంగాల్) విన్నర్, రన్నరప్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో శుక్రవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (ఏపీ సర్కిల్) బి.పి.శ్రీదేవి, వాల్తేరు రైల్వే డివిజన్ మేనేజర్ లలిత్ బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ప్రత్యేక అతిథిగా జయరాం హాజరు కాగా, పోస్ట్ మాస్టర్ జనరల్ విశాఖ రీజియన్ వి.ఎస్.జయశంకర్, పోస్ట్ మాస్టర్ జనరల్ కర్నూలు రీజియన్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర, సీనియర్ సూపరింటెండెంట్ ఎస్‌వీఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

అవగాహనతోనే మధుమేహవ్యాధి నియంత్రణ


మధుమేహవ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహార స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మధుమేహాన్ని ముందుగా గ్రహించగలగాలన్నారు. మధుమేహ నివారణకు ఆరోగ్యకరమైన పద్ధతులు అవలంబించి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారం, భోజన ప్రణాళికకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శరత్‌బాబు, ఇండస్ హాస్పిటల్ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ వి.సునీత, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుజాత పాల్గొని మధుమేహ నివారణకు సూచనలు చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

అక్కయ్యపాలెం, నవంబరు 14 (ఆంధ్రజోతి): బాలల దినోత్సవాన్ని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి పాటలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. విచిత్ర వేషధారణలో ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వీఎం శైలజ, హేమలత, జ్యోతిక, శోభాగీత పాల్గొన్నారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం, ఉపాధ్యాయులు ప్రభాకర్, కిశోర్, గ్లోరీ, శ్యామల, రామలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల్లో పోటీలు

కంచరపాలెం: కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ ఆర్పీపేట, కప్పరాడ ఉన్నత పాఠశాలలు, కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. బాలల దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజ్యలక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు, కె.విఘ్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 55వ వార్డు పరిధి గిరీషాస్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు టీడీపీ అధ్యక్షుడు బండి రంజిత్ విచ్చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధాన కార్యదర్శి రమణ అప్పారావు, ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.



బాలల దినోత్సవం సందర్భంగా కేంద్రీయ విద్యాలయంలో చిన్నారుల సందడి

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు వాసంతి ఎంపిక



కంచరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న ఇంటూరి వాసంతి జాతీయ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన వాసంతి క్రీడా కోటాలో ఇక్కడ కెమికల్ కళాశాలలో సీటు పొందింది. ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభాపాటవాలు కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 18న జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడనుంది. 2023లో కర్ణాటకలో, 2024లో జమ్ము కశ్మీర్‌లో జరిగిన అండర్-17 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో ఏపీ తరపున పాల్గొని ప్రతిభ చూపింది. ఇంతవరకు మూడుసార్లు జాతీయ, నాలుగుసార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంది. వాసంతిని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన షేక్ బషీర్ (ఫైల్)

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలో భవనంపై నుంచి పడి అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముస్లిం తాటిచెట్లపాలెంకి చెందిన షేక్ నాగూర్ మీరా కుమారుడు షేక్ బషీర్ (30) లైటింగ్ పనులు చేస్తుంటాడు. డబ్బులు ఇంటికి ఇవ్వకుండా మద్యం తాగేవాడు. ఒక్కోసారి రాత్రిపూట ఇంటికి వెళ్లేవాడు కాదు. గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పనికి వెళ్లి వస్తానని తండ్రికి చెప్పి బయటకు వచ్చిన బషీర్ రాత్రి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం పోర్టు ఆసుపత్రి ఎదురు రోడ్డులోని ఓ బిల్డింగ్ పక్కన యువకుడు చనిపోయి ఉన్నట్లు షేక్ నాగూర్ మీరాకు స్థానికులు తెలిపారు. దీంతో అక్కడికి వెళ్లి తన కుమారుడు మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాంబట్ల శ్రీనివాస్ సంఘటన స్థలానికి సిబ్బందితో వెళ్లి విచారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. బషీర్ రాత్రి ఎవరితోనో కలిసి మద్యం తాగాడని, మృతుడి కంటిపై తీవ్రగాయం ఉండటం, కాలు, చేతులు విరిగి ఉండటంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు


సారె ఊరేగిస్తున్న స్థానికులు

అక్కయ్యపాలెం, నవంబరు 14 (ఆంధ్రజోతి): గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా 26వ వార్డు రామకృష్ణానగర్ కాళ్ళవారితోట రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి సారె ఊరేగింపు శుక్రవారం జరిగింది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు రామలింగేశ్వరాలయం నుంచి రామకృష్ణానగర్, శంకువానిపాలెం, ఎన్డీ కాలేజీ మీదుగా అక్కయ్యపాలెం ప్రధాన రహదారి జగ్గారావు బ్రిడ్జి వద్ద గల గౌరీ పరమేశ్వరుల అమ్మవార్ల వేదిక వరకు కొనసాగింది. ఉత్సవం జరిగిన నెల రోజులూ ఆలయానికి మహిళలు పండ్లు, మిఠాయిలు, చీర, జాకెట్లు, పసుపు కుంకుమలతో ఊరేగింపుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కాళ్ళ సూర్యప్రకాశ్, బొడ్డేటి రవికుమార్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరంభం అదిరింది

... 5వ పేజీ తరువాయి

విదేశాల నుంచి భారీగా అతిథులు తరలి వచ్చారు. అధికారులు పది రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. వాహన రాకపోకల నుంచి అతిథి మర్యాదల వరకు అన్నీ సజావుగా సాగాయి. వచ్చిన వారికి రుచికరమైన వంటకాలు వడ్డించారు. బీ టు బీ సమావేశాలు, సెషన్లు నిర్వహించడానికి ఏర్పాటుచేసిన వేదికలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఏపీ పెవిలియన్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

బాబు, లోకేశ్ వేర్వేరుగా సమావేశాలు

సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఇద్దరూ వేర్వేరుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఒప్పందాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తో కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పియూష్ గోయల్ పక్కనే ఉండి పలు ప్లీనరీల్లో పాల్గొన్నారు. ఇద్దరూ కలసి స్పేస్, డ్రోన్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరికీ డ్రోన్ అవసరం అవుతుందని, ఇది ప్రధాని మోదీ విశ్వాసమని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త సోమనాథ్ మాట్లాడుతూ స్పేస్ సిటీ ఏర్పాటు సీఎం చంద్రబాబు కల అని, ఇది ఇలా సాధ్యమైందని పేర్కొన్నారు.

పర్యాటకంలో 100 ఒప్పందాలు

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం రాత్రి సదస్సు ప్రాంగణాన్ని సందర్శించి తొలిరోజు సదస్సు విజయవంతమైనందుకు హర్షం వ్యక్తంచేశారు. పర్యాటకంలో 100 ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించనున్నామని ప్రకటించారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక వెనకడుగు వేసిన పారిశ్రామికవేత్తలంతా తాజాగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు.

ఉప రాష్ట్రపతికి సాదర స్వాగతం, ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడానికి విచ్చేసిన ఉప రాష్ట్రపతి సీ.పి.రాధాకృష్ణన్‌కు శుక్రవారం ఉదయం కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తదితరులు సాదర స్వాగతం పలికారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న అనంతరం శుక్రవారం రాత్రి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తిరుగు ప్రయాణమయ్యారు. ఐఎన్ఎస్ డేగ ఎయిర్‌పోర్టులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చి ఇతర అధికారులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

విశాఖ-కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమలై వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖ-కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

విశాఖ-కొల్లాం : 08539 నంబరు గల రైలు ఈ నెల 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 1.45 గంటలకు కొల్లాం చేరుతుంది.

కొల్లాం-విశాఖ : 08540 నంబరు గల రైలు ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 5 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటి రోజు (గురువారం) రాత్రి 11 గంటలకు విశాఖ చేరుతుంది.

ఈ సర్వీసులు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కోచ్‌లతో దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఇరోడ్, తిరుపూర్, పొడనూర్, పాలక్కాడ్, త్రిచూర్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్యాం, తిరువెల్ల, చెంగన్నూర్, కయంకులమ్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ప్రశాంతి, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు థర్డ్ ఏసీ కోచ్

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ మీదుగా నడిచే భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక అదనపు థర్డ్ ఏసీ కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463)కు ఈ నెల 17 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలోని బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు (18464) ఈ నెల 18 నుంచి డిసెంబరు 1 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ అందుబాటులో ఉంటుంది.

అలాగే భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు (22879) ఈ నెల 22 నుంచి 29 వరకు, తిరుగు ప్రయాణంలోని తిరుపతి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌కు (22880) ఈ నెల 23 నుంచి 30 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేస్తారు.

23న 'గురు వైభవం' వేదాంత శ్రవణం

డాబాగార్డెన్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో 'గురు వైభవం'పై తెలుగులో వేదాంత శ్రవణం నిర్వహిస్తున్నట్టు పెంట వాశిష్ఠ కార్తికేయ శర్మ తెలిపారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. వేద, శాస్త్ర పండితుడు పేరి రవికుమార్ ఈ అంశంపై ప్రవచనమిస్తారన్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య, లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 60, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 58, బీరకాయలు 58, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

ప్రపంచం చూపు.. విశాఖ వైపు

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సదస్సు ప్రాంగణంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

సిరిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీఐఐ భాగస్వామ్య సదస్సుతో ప్రపంచమంతా విశాఖ వైపే చూస్తోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. తొలి రోజు సీఐఐ సదస్సులో పాల్గొన్న ఆయన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఏపీ రాష్ట్ర అభివృద్ధికి అద్దం పట్టేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ సమ్మిట్‌లో పెట్టుబడుల జాతర జరుగుతోందని, ఇవన్నీ కార్యరూపంలోకి వస్తే, ఏపీలో నిరుద్యోగం దూరకానుందన్నారు. సదస్సుకు ముందు రోజునే విశాఖలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 5 రంగాల్లో 35 సంస్థలతో రూ.3.65 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకోవటం, సమ్మిట్ సత్ఫలితాలను ఇస్తోందనడానికి నిదర్శనంగా చెప్పవచ్చాన్నారు. గత వైసీపీ పాలనలో కొనసాగిన కక్షసాధింపు చర్యలతో రాష్ట్రానికి వచ్చిన అనేక పారిశ్రామిక సంస్థలు పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విజనరీ లీడర్ ముఖ్యమంత్రిగా ఉండడంతో పారిశ్రామిక వేత్తలు ఏపీ వైపు చూస్తున్నారన్నారు. అందువల్లే పెట్టుబడిదారులు రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. విశాఖ సమ్మిట్ విజయవంతంగా సాగుతుండడం అందరి సమన్వయ ఫలితమేనన్నారు.

దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు

» లీగల్ సెల్ అథారిటి కార్యదర్శి సన్యాసినాయుడు



సమావేశంలో ప్రసంగిస్తున్న జస్టిస్ సన్యాసినాయుడు

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మన సంకల్పం దృఢమైనదైతే మనం దేనినైనా సాధించగలుగుతామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. జాతీయ చిల్డ్రన్స్ డే సందర్భంగా శుక్రవారం చినగదిలిలోని ప్రభుత్వ బాలురగృహంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత భారత్ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు అందరూ తల్లిదండ్రులతో పాటు ఇతరులనూ గౌరవించడాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎదగడం, తెలుసుకోవడం, నేర్చుకోవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అప్పుడే పిల్లల్లో వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సూపరింటెండెంట్ రమణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, వైద్యులు జీవన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు కె.వెంకటలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

అలాగే దీన్‌దయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో చిల్డ్రన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సన్యాసిరావు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి సమాజ నిర్దేశకులు నేటి బాలలన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర సోషల్ వెల్ఫేర్ వారు అందించిన నోటు పుస్తకాలు, ప్యాడ్స్ తదితర స్టేషనరీ సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పరిశీలన గృహం పర్యవేక్షణాధికారి షణ్ముఖరావు, సూపరింటెండెంట్ అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు. చినగదిలిలోని ప్రభుత్వ బాలికల పరిశీలన గృహంలో కూడా బాలలవారోత్సవ ప్రారంభ వేడుకలను నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం ఏర్పరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి విద్యా దశ నుంచి సేవా భావం అలవరచుకోవాలని, తద్వారా చక్కని వ్యక్తిత్వం గల వారిగా తయారవుతున్నారని తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. తోటగరువులో గత వారం నుంచి ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథం ఉన్న విద్యార్థులు సద్భావన కలిగిన వారై ఉంటారన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరం వంటివి నిర్వహించడం ద్వారా సమాజంతో మమేకమయ్యే అవకాశం లభిస్తుందని, విద్యార్థుల జీవితంలో మున్ముందు ఇదెంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ మూర్తి,ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారి ఎస్.భాస్కరరావు తదితరులతో పాటు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడిగా డాక్టర్ శ్రీనివాస్



డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ఆరిలోవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడిగా డాక్టర్ సజ్జా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు పశువైద్య శాలలో పని చేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న బ్రెజిల్‌వాసులు



ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకుడు

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీఐఐ సదస్సుకు వచ్చిన స్వదేశ ప్రముఖులతో పాటు ముగ్గురు బ్రెజిల్ దేశస్తులు కూడా వరాహలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. నుదుట తిలకం దిద్దుకుని సింహాద్రినాథుడ్ని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో జరిగిన స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణంలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదు

జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు



భీమారావును సన్మానిస్తున్న కార్యవర్గ ప్రతినిధులు

భీమునిపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు పోరాటం చేయాలని జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.డి. ప్రసాదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమిలి తాలూకా ప్రభుత్వ పింఛనుదారుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయడం లేదని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను కార్పొరేట్ ఆస్పత్రులు అంగీకరించడం లేదని చెప్పారు. పీఆర్‌సీ వేయలేదని, ఇతర బకాయిలను చెల్లించడం లేదని చెప్పారు. వీటి సాధనకు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం భీమిలి తాలూకా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా తట్టికోట భీమారావు, ప్రధాన కార్యదర్శిగా కనకల సన్యాసినాయుడు, కోశాధికారిగా పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భీమారావును నూతన కార్యవర్గ ప్రతినిధులు సన్మానించారు.

జనసేన పార్టీలో 20 మంది చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన భీమిలి ఇన్‌చార్జి సందీప్

ఎండాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నాలుగో వార్డుకు చెందిన పలు పార్టీల నుంచి 20 మంది కార్య కర్తలు జనసేన పార్టీలో చేరారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పిళ్లా బాలు, ఒమ్మిడి రాజు, కె. ప్రసాద్, నరేశ్, రామకృష్ణ, నాగోతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు నీట్‌లో ప్రత్యేక శిక్షణ

- » రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 109 గురుకులాల్లో అమలు
- » 120 మంది చొప్పున బాలబాలికలకు శిక్షణ
- » రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవిత



విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి తినిపిస్తున్న మంత్రి సవిత

సింహాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలె ఏపీ బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో విద్యార్థులకు నీట్ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. అడివివరంలోని మహాత్మా జ్యోతిబా పూలె ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సవిత మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇందులో భాగంగా గురుకుల విద్యార్థులకు మంచి నాణ్యత కలిగిన యూనిఫారాలు, పుస్తకాలు, రుచికర, పోషక విలువలతో కూడిన భోజన సదుపాయం, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తాజాగా సీఎం చంద్రబాబు వినూత్నంగా ఆలోచించి గురుకుల విద్యార్థులు కూడా ఇతరులతో సమానంగా ఇంజనీరింగ్, మెడిసిన్‌లలో సులభంగా ప్రవేశం పొందాలని కోరుకుంటున్నారని, అందుకు తగినట్టుగా రాబోయే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 109 గురుకులాల నుంచి 120 మంది బాలురు, 120 మంది బాలికలను ఎంపిక చేసి వాళ్లకు నీట్, ఎంసెట్‌లలో శిక్షణ అందించాలని నిర్ణయించామన్నారు. ఇందు కోసం బాలురకు అడివివరం గురుకుల పాఠశాల, అనంతపురం గురుకుల పాఠశాలను బాలికల కోసం ఎంపిక చేశామన్నారు. ఇప్పటివరకు ఉన్న వసతి సౌకర్యాలను వినియోగించుకొని శిక్షణ ఇస్తామన్నారు.

అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్‌ను కార్యదర్శి సత్యనారాయణతో కలిసి కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమామోహిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రచారం పీక్.. పరిశుభ్రత వీక్

» డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో కానరాని స్వచ్ఛత



డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాల మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలు

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కళాశాల మైదానం ప్రహరీ పక్కన గుబురుగా చెట్లు, ముళ్ల పొదలతో అడవిని తలపిస్తోంది. కళాశాలలో వారానికోసారి స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత హీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. రెండు పిచ్చి మొక్కలు లాగి ఫోటోలకు పోజులిచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. క్రమం తప్పకుండా ప్రతి వారం కళాశాలలో స్వచ్ఛత మీద ఒక కార్యక్రమం ఉంటుంది. ప్రచారం పీక్‌లో ఉంటుంది కాని పరిశుభ్రతే చాలా వీక్‌గా ఉందని వాకర్స్ ఎద్దేవా చేస్తున్నారు. కాగా, కృష్ణా కళాశాల ప్రాంగణంలో డిగ్రీ, జూనియర్, వొకేషనల్ మూడు కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో సుమారు 4 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారంతా ఒక్క రోజు స్వచ్ఛభారత్ చేస్తే పిచ్చి మొక్కలే కనిపించవు. కళాశాలల మధ్య అంతర్గత విభేదాలతో 'ఎవరికి వారే..' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కళాశాల పరిశుభ్రత గాలి కొదిలేసి స్వచ్ఛభారత్ అంటూ మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మైదానం, ఇతర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. మొక్కల వల్ల కీటకాలు, పాములు వచ్చే ప్రమాదముందని విద్యార్థులు భయయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా కళాశాల యాజమాన్యాలు కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టాలని వాకర్స్, విద్యార్థులు కోరుతున్నారు.

20వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా శివారెడ్డి



పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా కంభాపు శివారెడ్డి నియమితులయ్యారు. ఎమ్మెల్యే లు వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి పర్యవేక్షణలో 20వ వార్డు కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షుడిగా కంభాపు శివారెడ్డి, ఉపాధ్యక్షుడుగా బొట్టా నిరంజన్ సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలకొల్లు మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.మంగన్న, ఎం.సీతన్న రెడ్డి, జి.అప్పలరెడ్డి, కార్యదర్శులుగా ఎ.శ్రీనివాసరావు, బి.గోవింద రెడ్డి, రాచకొండ దశరథరామయ్య, కోశాధికారిగా బీవీకే సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. ఎన్నికైన వారినిఎమ్మెల్యే రామకృష్ణబాబు, టీటీడీ స్థానిక సలహా మండల చైర్మన్ చోడే వెంకట పట్టాభిరామ్, పోతన్న రెడ్డి తదితరులు అభినందించారు.

నగరంపాలెం యువకుడికి ఏయూ డాక్టరేట్

మధురవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం యువకుడు ఇలిపిల్లి అనిల్‌కుమార్‌కు ఏయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమేరకు వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ శుక్రవారం ఆయనకు తన కార్యాలయంలో పట్టా అందజేశారు. అనిల్‌కుమార్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్య ఎం.గోపీచంద్‌నాయక్ పర్యవేక్షణలో మల్టీ ఆబ్జెక్టివ్ అప్రోచ్ ఫర్ ఆప్టిమల్ ఎలకేషన్ ఆఫ్ డీజీ ఇన్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా..

17న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

» ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, భద్రతను హరిస్తూ పని గంటలు పెంచుతూ, కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బ్రోచర్‌ను ప్రదర్శించారు. ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలులో జరుగుతున్న జాప్యాన్ని భరించలేని పాలకులు, మేడే ద్వారా సాధించుకున్న రోజుకు 8 గంటల పనిని ఓటీతో కలిపి 12 గంటల పని దినంగా పెంచుతూ చట్టాలు మారుస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం 2025 సెప్టెంబరు 19న అసెంబ్లీలో ఆమోదించి, చట్ట సవరణ చేస్తూ నవంబరు 3న జీవో 23 విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 12 సంవత్సరాలుగా 67 షెడ్యూల్ రంగాల కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను ఉచితంగా కార్పొరేట్ వర్గాలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. డేటా సెంటర్ ద్వారా లక్షా 85 వేల ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు, లోకేశ్, ఎంపీ శ్రీభరత్ ప్రచారం చేస్తున్నారని, దాని వల్ల మంచినీరు, విద్యుత్ కొరత, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ నెల 17న అన్ని జిల్లాల్లో ధర్నాలు చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, నాయకులు బి.గీత, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, బి.భూషణం, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామకృష్ణ, సిహెచ్ చిన్నారి, కె.శ్రీనివాసరావు, గుర్రప్ప, కె.రామారావు, వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణం చక్కని అనుభూతి కలిగించాలి

» సిబ్బందికి ఏడీఆర్ఎం రామారావు సూచన



ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సర్వీసెస్ సిబ్బందికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఏడీఆర్ఎం రామారావు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సదుపాయాల నిర్వహణలో చిత్తశుద్ధి పాటించాలని వాల్తేరు రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ కె.రామారావు పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంపై శుక్రవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సర్వీసెస్ (వోబీహెచ్ఎస్) సూపర్‌వైజర్లు, సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం మాట్లాడుతూ రైలు ప్రయాణికులకు అందించే సేవల మెరుగుదలకు దృష్టి సారించాలన్నారు. రైళ్లలో పరిశుభ్రత పాటిస్తూ, ప్రయాణికులతో మర్యాదపూర్వక విధానాన్ని అవలంబించాలని సూచించారు. వారికి మంచి ప్రయాణ అనుభూతి కలిగేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

బిహార్‌లో గెలుపుతో బీజేపీ సంబరాలు



పరశురామ్‌రాజుకు మిఠాయి తినిపిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయదుందుభి మోగించి, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆ పార్టీలు శుక్రవారం నగరంలో సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం నగర బీజేపీ కార్యాలయంలో బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎ ఎన్ పరశురామ్‌రాజు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర 20 పాయింట్స్ చైర్మన్ లంక దినకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోలాహలంగా పాల్గొని బాణసంచా పేల్చిమిఠాయిలు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

హిడెన్ స్ప్రౌట్స్ పాఠశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ప్రతాప్ రుద్ర

పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర విచ్చేసిన మానసిక దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక అవసరాల పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ మధు, ఉపాధ్యాయులు సురేష్, పద్మ, సరళ, స్వాతి, జోగులు, రాజు, చిన్నతల్లి, శైలజ, భవాని, పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


పౌరగ్రంథాలయంలో పఠన విభాగాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కె.సి.రెడ్డి



బాల సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణమ్మ, విశాలాక్షి, ఇతర ప్రముఖులు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాట్లాడుతున్న కార్యదర్శి కుమార్‌రాజా

పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదు

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.సి.రెడ్డి వ్యాఖ్య
- పోటీ ప్రపంచంలో విద్యార్థులు నెగ్గాలంటే గ్రంథాలయాన్ని నమ్ముకోండి

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం ఓ జ్ఞాననిధి. విజ్ఞాన సముపార్జనకు, ఉద్యోగార్జనకు దోహదపడుతుంది. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే విద్యార్థులు గ్రంథాలయాన్ని నమ్ముకోవాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ నాలెడ్జి టెక్నాలజీస్ పూర్వ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సి.రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ప్రారంభమైన 58వ గ్రంథాలయ వారోత్సవాలను ప్రొఫెసర్ కె.సి. రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్‌లో ఏ సమాచారమైనా లభిస్తుందని నమ్ముతున్న పరిస్థితులు, అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధతో గ్రంథాలయాల అవసరం ఉందా? అనే ప్రశ్న తలెత్తుతుందని, అయితే పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదని ఆయన స్పష్టంచేశారు. పౌరగ్రంథాలయంలో జ్ఞానార్జనకు తగిన వాతావరణం ఉందని, ఇక్కడి సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ గ్రంథాలయం ఆదరణ పొందడానికి కారణం పాలక వర్గం, సిబ్బంది శ్రద్ధ, అంకితభావమేనని ప్రశంసించారు. వారోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు కె.సి.రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. గ్రంథాలయ కమిటీ ఉపాధ్యక్షుడు టి.ఎస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డీఎస్ వర్మ ఇక్కడ అందిస్తున్న సేవలను, ఇక్కడ పలు విభాగాలను వివరించారు. బాలల దినోత్సవం సందర్భంగా బాల బాట పత్రిక సంపాదకురాలు కె.ఎస్.వి. రమణమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. బాల సాహిత్యంపై డాక్టర్ డి.వి.సూర్యారావు, చల్లా రాంబాబు, దామరాజు విశాలాక్షి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రచయితలు, కవులు, విమర్శకులు, సాహితీవేత్తలు మేడా మస్తాన్‌రెడ్డి, లైబ్రరీ అడ్మినిస్ట్రేటర్ వరలక్ష్మి, లైబ్రేరియన్ దుర్గారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ..

మహారాణిపేట: గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా శుక్రవారం సూర్యాబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జ్ఞానాన్ని అందించేవి పుస్తకాలేనని, అందువల్ల బాల్యం నుంచే తమ గ్రంథాలయాలను సందర్శించి విస్తారమైన పుస్తక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ నెల 20 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.తిరుమల కుమారి, కేవీఎస్ నరసింహం, పీవీఎస్ రాజు, రాజేంద్రవర్మ, యోగానంద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఎంతో మేలు

అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల మేధస్సు పెరుగుదలకు పుస్తకపఠనం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి, సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డా.ఉమాగాంధీ, ఎస్.అప్పలరెడ్డి, గ్రంథాలయ అధికారి పీవీఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ పితామహుడు డా.ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి ప్రసన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.


సెయింట్‌జోసెఫ్ కళాశాలలో పుస్తక ప్రదర్శన

పుస్తకాలే మంచి నేస్తాలు

మురళీనగర్: గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడం దినచర్యగా మార్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీఎస్.మూర్తి సూచించారు. విద్యార్థులకు పుస్తకాలే మంచి నేస్తాలవుతాయని పేర్కొన్నారు. మురళీనగర్‌లోని మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వరప్రసాద్, పివిఎస్.రాజు, యు.రాజ్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

కీలక ఒప్పందాలతో ఉద్యోగాల వెల్లువ

దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఐఐ భాగస్వామ్య సదస్సులో తొలిరోజు వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ ఒప్పందాలు ద్వారా కోట్లాది రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వస్తుండగా, లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న పలు సంస్థల ప్రతినిధులను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పలకరించగా వివరాలను వెల్లడించారు.

ఏపీ యువతలో నైపుణ్యానికి కొదవలేదు



ఏపీలో నైపుణ్యం గల యువతకు కొదవలేదు. సరికొత్త ఆవిష్కరణలు సృష్టించే దిశగా మా కంపెనీ వివిధ రంగాల్లో యువతకు శిక్షణ, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. కుప్పంలో ప్రయోగాత్మకంగా సంస్థ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సీఐఐ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకున్నాం. భవిష్యత్తులో రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ ప్రారంభిస్తాం. ఐదేళ్లలో పది వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

- ఎస్.శివకుమార్, టెట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, బెంగళూరు

20 లక్షల మందికి ఉపాధి..



సీఐఐ సమ్మిట్‌తో రూ.పది లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల మందికి ఉపాధి లభించనుంది. గతంలో అమర్‌రాజా వంటి కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. సీఎం చంద్రబాబు విజన్ ఉన్న వ్యక్తి. ఇంటికో వ్యాపారవేత్తను తయారుచేయాలనే లక్ష్యం ఇలాంటి సమ్మిట్‌లతో నెరవేరుతుంది. ఇందులో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది.

- డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ బోర్డు డైరెక్టర్, విజయవాడ

పరిశ్రమల ఏర్పాటుకు మంచి తరుణం



ఏపీలో అపారమైన సహజ వనరులు ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైనది. మా సంస్థ పారిశ్రామిక, పెట్టుబడిదారులకు అవసరమైన ప్రాజెక్టులను సిద్ధం చేస్తుంది. అమరావతి కేంద్రంగా సంస్థ ఏర్పాటుకు ఎంవోయూ చేసుకుంటున్నాం. పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా సంస్థ కార్యకలాపాలు ఉంటాయి.

-ఎంఎన్ రావు, శ్రీకరి బిజినెస్ కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్

అమరావతికి అండగా

మలేసియాలోని 4 లక్షల మంది భారతీయుల కోరిక మేరకు అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా అమరావతిలో రూ.200 వందల కోట్లతో టవర్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకుంటున్నాం. అమరావతి అభివృద్ధికి ప్రపంచంలోని తెలుగు వారంతా కలసి రావాల్సిన అవసరం ఉంది. మలేసియా తెలుగు సంఘం వినతి మేరకు తొమ్మిది మంది సభ్యులం సమ్మిట్‌లో పాల్గొన్నాం.

- తువాన్ గణపతిరావు, మలేసియా ఎంపీ

ఏపీలో పరిశ్రమల ఏర్పాటుపై అధ్యయనం

విశాఖ మాదిరిగా తొయామా నగరం సముద్ర తీర ప్రాంతం. ఈ నగరంలో ఔషధ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యావసర వస్తువులు, ఇతర డొమెస్టిక్ అవసరాలకు తగ్గ పరిశ్రమలు అధికంగా జపాన్‌లో ఉన్నాయి. అటువంటి పరిశ్రమలు ఏపీలో పెట్టేందుకు ఉన్న అవకాశాలు అధ్యయనం చేయడానికి సదస్సుకు వచ్చాం. ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలో అక్కడి పరిశ్రమలకు చెందిన ఏపీకి వచ్చేలా చొరవ తీసుకుంటాం.

- తనోవెరా, తోయమా, జపాన్

రూ.2,500 కోట్లతో విశాఖలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ



రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. రూ.2,500 కోట్లతో పెట్టుబడి పెట్టనున్నాం. మొదటి ఫేజ్‌లో రూ.2,000 కోట్లు పెట్టి 1,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. రెండో దశలో మిగిలిన రూ.500 కోట్లను పెట్టుబడి పెడతాం. దక్షిణ భారతదేశంలో ఈ తరహా పరిశ్రమ ఏర్పాటుకావడం ఇదే తొలిసారి. దీన్ని విశాఖలో ఏర్పాటు చేయబోతున్నాం. కేంద్ర ప్రభుత్వం, మైటీ రూపొందించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌లో భాగంగా పది ప్రాజెక్టులకు రూ.76 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ పది ప్రాజెక్టుల్లో మాది ఒకటి. దీనిని సీఎం చంద్రబాబు చొరవతో విశాఖలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇప్పటివరకూ సెమీ కండక్టర్ల కోసం తైవాన్, కొరియా, జపాన్ దేశాలపై ఆధారపడుతూ వస్తున్నాం. ఇకపై మనమే తయారు చేసుకోబోతున్నాం.

- వెంకట సింహాద్రి, ఎండీ, ఆసిప్ టెక్నాలజీ

న్యూరాలజీ సమస్యలపై అవగాహన సదస్సు


డాక్టర్ ఎస్.గోపికి జ్ఞాపిక అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎపిలెప్సీ దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి ఆధ్వర్యంలో శుక్రవారం న్యూరాలజీ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోగులకు ఫిట్స్, న్యూరాలజీ సమస్యలు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, అధునాతన చికిత్స విధానం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, న్యూరాలజీ వైద్యులు డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.సతీష్ కుమార్, డాక్టర్ సిహెచ్ సుష్మా, డాక్టర్ మనోజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేడియో థెరపీ ఆవిర్భావ దినోత్సవం

కేజీహెచ్ రేడియో థెరపీ విభాగం ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విభాగాధిపతులు, వైద్యులను సత్కరించారు. సూపరింటెండెంట్ డా ఐ.వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ ఎన్.వెంకటపతిరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూరీలో వైద్య విద్యార్థుల ప్రతిభ

పూరీలో నిర్వహించిన శిశు శస్త్రచికిత్స వైద్యనిపుణుల సదస్సులో క్విజ్‌లో డాక్టర్ తేజా శ్రీనివాస్, పరిశోధనా పత్ర విభాగంలో డాక్టర్ సుష్మితా, డాక్టర్ వంశీసూర్యాలు ప్రతిభ చాటుకోవడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, అధ్యాపకులు అభినందించారు.

కోలుకున్న రోగి ఉదారత

తనకు మెరుగైన వైద్యం అందించి స్వస్థత చేకూర్చినందుకు మచిలీపట్నంకు చెందిన కొక్కిలిగెడ్డ యాబ్ కేజీహెచ్‌కు రూ. 20 వేల విలువైన 4 వీల్‌చైర్లు, బీపీ పరీక్షించే రెండు పరికరాలను అందించి ఉదారత చాటారు. ఇతరుల మేలుకోరే ఆయన కృతజ్ఞతాభావాన్ని ఆసుపత్రి వైద్య వర్గాలు అభినందించాయి.

పోస్టల్ టీటీ చాంప్స్ పశ్చిమ బెంగాల్, తెలంగాణ


సింగిల్స్ మెన్, విమెన్ విన్నర్లు ఆకాష్ నాథ్, పౌలమి దాస్‌లకు జ్ఞాపికలు అందజేస్తున్న చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ నిర్వహించిన 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నీ మహిళల విభాగంలో పశ్చిమ బెంగాల్, పురుషుల విభాగంలో తెలంగాణ ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. గుజరాత్, తమిళనాడులు రన్నరప్‌గా నిలిచాయి. సింగిల్స్ ఈవెంట్‌లో విన్నర్‌గా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాష్ నాథ్, రన్నరప్‌గా కె.పవన్‌కుమార్ (తెలంగాణ)...మహిళల కేటగిరీలో పౌలమి దాస్ (పశ్చిమ బెంగాల్) విన్నర్, తమిళనాడుకు చెందిన అభినయ రమేష్ రన్నరప్ స్థానాలను సాధించారు. పురుషుల డబుల్స్‌లో ఆకాశ్‌నాథ్-సౌరవ్ (వెస్ట్ బెంగాల్) విన్నర్‌గా, పవన్-ఉమేష్ (తెలంగాణ) రన్నరప్‌గా నిలిచారు. మహిళల డబుల్స్‌లో సయని-సంగీత (పశ్చిమబెంగాల్), శైలు నూర్‌బాష-శ్రీలక్ష్మి (ఆంధ్ర)...మిక్స్‌డ్ డబుల్స్‌లో వివి.వాల-దివ్య గోయల్ (గుజరాత్), పౌలమిదాస్-ఆకాశ్ (పశ్చిమ బెంగాల్) విన్నర్, రన్నరప్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో శుక్రవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (ఏపీ సర్కిల్) బి.పి.శ్రీదేవి, వాల్తేరు రైల్వే డివిజన్ మేనేజర్ లలిత్ బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ప్రత్యేక అతిథిగా జయరాం హాజరు కాగా, పోస్ట్ మాస్టర్ జనరల్ విశాఖ రీజియన్ వి.ఎస్.జయశంకర్, పోస్ట్ మాస్టర్ జనరల్ కర్నూలు రీజియన్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర, సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

అవగాహనతోనే మధుమేహవ్యాధి నియంత్రణ


మధుమేహవ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహార స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మధుమేహాన్ని ముందుగా గ్రహించగలగాలన్నారు. మధుమేహ నివారణకు ఆరోగ్యకరమైన పద్ధతులు అవలంబించి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారం, భోజన ప్రణాళికకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శరత్‌బాబు, ఇండస్ హాస్పిటల్ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ వి.సునీత, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుజాత పాల్గొని మధుమేహ నివారణకు సూచనలు చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

అక్కయ్యపాలెం, నవంబరు 14 (ఆంధ్రజోతి): బాలల దినోత్సవాన్ని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి పాటలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. విచిత్ర వేషధారణలో ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వీఎం శైలజ, హేమలత, జ్యోతిక, శోభాగీత పాల్గొన్నారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం, ఉపాధ్యాయులు ప్రభాకర్, కిశోర్, గ్లోరీ, శ్యామల, రామలక్ష్మీ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పోటీలు

కంచరపాలెం: కంచరపాలెం పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ ఆర్పీపేట, కప్పరాడ ఉన్నత పాఠశాలలు, కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. బాలల దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజ్యలక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు, కె.విఘ్నేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు. 55వ వార్డు పరిధి గిరీషాస్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు టీడీపీ అధ్యక్షుడు బండి రంజిత్ విచ్చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధాన కార్యదర్శి రమణ అప్పారావు, ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.



బాలల దినోత్సవం సందర్భంగా కేంద్రీయ విద్యాలయంలో చిన్నారుల సందడి

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు వాసంతి ఎంపిక

కంచరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న ఇంటూరి వాసంతి జాతీయ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన వాసంతి క్రీడా కోటాలో ఇక్కడ కెమికల్ కళాశాలలో సీటు పొందింది. ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభాపాటవాలు కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 18న జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడనుంది. 2023లో కర్ణాటకలో, 2024లో జమ్ము కశ్మీర్‌లో జరిగిన అండర్-17 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో ఏపీ తరపున పాల్గొని ప్రతిభ చూపింది. ఇంతవరకు మూడుసార్లు జాతీయ, నాలుగుసార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంది. వాసంతిని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపకులు అభినందించారు.



ఆరంభం అదిరింది

... 5వ పేజీ తరువాయి

విదేశాల నుంచి భారీగా అతిథులు తరలి వచ్చారు. అధికారులు పది రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. వాహన రాకపోకల నుంచి అతిథి మర్యాదల వరకు అన్నీ సజావుగా సాగాయి. వచ్చిన వారికి రుచికరమైన వంటకాలు వడ్డించారు. బీ టు బీ సమావేశాలు, సెషన్లు నిర్వహించడానికి ఏర్పాటుచేసిన వేదికలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఏపీ పెవిలియన్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

బాబు, లోకేశ్ వేర్వేరుగా సమావేశాలు

సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఇద్దరూ వేరేవ్వరుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఒప్పందాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తో కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పియూష్ గోయల్ పక్కనే ఉండి పలు ప్లీనరీల్లో పాల్గొన్నారు. ఇద్దరూ కలసి స్పేస్, డ్రోన్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరికీ డ్రోన్ అవసరం అవుతుందని, ఇది ప్రధాని మోదీ విశ్వాసమని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త సోమనాథ్ మాట్లాడుతూ స్పేస్ సిటీ ఏర్పాటు సీఎం చంద్రబాబు కల అని, ఇది ఇలా సాధ్యమైందని పేర్కొన్నారు.


పర్యాటకంలో 100 ఒప్పందాలు

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం రాత్రి సదస్సు ప్రాంగణాన్ని సందర్శించి తొలిరోజు సదస్సు విజయవంతమైనందుకు హర్షం వ్యక్తంచేశారు. పర్యాటకంలో 100 ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించనున్నామని ప్రకటించారు. గత ప్రభుత్వంపై నమ్మకం లేక వెనకడుగు వేసిన పారిశ్రామికవేత్తలంతా తాజాగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు.

ఉప రాష్ట్రపతికి సాదర స్వాగతం, ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడానికి విచ్చేసిన ఉప రాష్ట్రపతి సీ.పి.రాధాకృష్ణన్‌కు శుక్రవారం ఉదయం కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, తదితరులు సాదర స్వాగతం పలికారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న అనంతరం శుక్రవారం రాత్రి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తిరుగు ప్రయాణమయ్యారు. ఐఎన్ఎస్ డేగ ఎయిర్‌పోర్టులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చి ఇతర అధికారులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన షేక్ బషీర్ (ఫైల్)

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలో భవనంపై నుంచి పడి అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్లిం తాటిచెట్లపాలెంకి చెందిన షేక్ నాగూర్ మీరా కుమారుడు షేక్ బషీర్ (30) లైటింగ్ పనులు చేస్తుంటాడు. డబ్బులు ఇంటికి ఇవ్వకుండా మద్యం తాగేవాడు. ఒక్కోసారి రాత్రిపూట ఇంటికి వెళ్లేవాడు కాదు. గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పనికి వెళ్లి వస్తానని తండ్రికి చెప్పి బయటకు వచ్చిన బషీర్ రాత్రి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం పోర్టు ఆసుపత్రి ఎదురు రోడ్డులోని ఓ బిల్డింగ్ పక్కన యువకుడు చనిపోయి ఉన్నట్లు షేక్ నాగూర్ మీరాకు స్థానికులు తెలిపారు. దీంతో అక్కడికి వెళ్లి తన కుమారుడు మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాంభట్ల శ్రీనివాస్ సంఘటన స్థలానికి సిబ్బందితో వెళ్లి విచారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. బషీర్ రాత్రి ఎవరితోనో కలిసి మద్యం తాగాడని, మృతుడి కంటిపై తీవ్రగాయం ఉండటం, కాలు, చేతులు విరిగి ఉండటంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు


సారె ఊరేగిస్తున్న స్థానికులు

అక్కయ్యపాలెం, నవంబరు 14 (ఆంధ్రజోతి): గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా 26వ వార్డు రామకృష్ణానగర్ కాళ్ళవారితోట రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి సారె ఊరేగింపు శుక్రవారం జరిగింది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు రామలింగేశ్వరాలయం నుంచి రామకృష్ణానగర్, శంకువానిపాలెం, ఎన్డీ కాలేజీ మీదుగా అక్కయ్యపాలెం ప్రధాన రహదారి జగ్గారావు బ్రిడ్జి వద్ద గల గౌరీ పరమేశ్వరుల అమ్మవార్ల వేదిక వరకు కొనసాగింది. ఉత్సవం జరిగిన నెల రోజులూ ఆలయానికి మహిళలు పండ్లు, మిఠాయిలు, చీర, జాకెట్లు, పసుపు కుంకుమలతో ఊరేగింపుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కాళ్ళ సూర్యప్రకాశ్, బొడ్డేటి రవికుమార్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

దుర్గమాంబకు పూజలు

అగనంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. లలితా పారాయణం, విష్ణుసహస్రనామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

కూర్మన్నపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో ఉన్న అన్నపూర్ణ దేవి సమేత విశ్వేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు వ్యాగ్వేశ్వర శర్మ పర్యవేక్షణలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ రాట ఉత్సవం

ఎస్.ఎ.డి.జంక్షన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్ఏడీ కొత్తరోడ్డులో కొలువైన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి 28వ షష్ఠి, అదే విధంగా కల్యాణ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా స్వామివారి కల్యాణరాట ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

పెదగంట్యాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నెల్లిముక్కు కాశీవిశ్వేశ్వరాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణ ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా కార్తీమాసం బహుళ ఏకాదశి రోజు ఇక్కడ శివపార్వతుల కల్యాణం నిర్వహించడం ఆచారంగా వస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడి ఆలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు

సినిమా గైడ్

● **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి(మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
● **జగ్రిస్** : జగదాంబ
● **శివ, రన్నింగ్ మాన్** : శారదా
● **దే దే ప్యార్ దే** : రమాదేవి
● **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
● **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
● **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 60, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 58, బీరకాయలు 58, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 48, క్యాబేజీ 26, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234



కణితి ఉన్నత పాఠశాలలో బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు



అగనంపూడి : దివ్యాంగులకు బెడ్‌షీట్లు, టిఫిన్ బాక్సులు అందజేస్తున్న దాతలు

బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుదాం

» బాలల దినోత్సవంలో వక్తల పిలుపు
» గాజువాక, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు

ఆటోనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కూడా కావడంతో ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పారిశ్రామిక ప్రాంతంలోని 70వ వార్డు శ్రీనివాసానగర్‌లో ట్వింకిల్ స్కూల్, శ్రీసాయి విద్యానికేతన్‌లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు దొడ్డి శ్యామ్, కరుణకుమారి, పి. వాసుదేవ రావు, లలితకుమారి, ఆర్. నరసింగరావు, నాగుల రవి కుమార్ పాల్గొన్నారు. కణితి ఉన్నత పాఠశాలలో 15 మంది బాలికలకు దువ్వాడ ఎస్‌బీఐ ఉద్యోగులు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఆర్ఎం నాగ వసంత, మేనేజర్ సతీశ్ కుమార్, పాఠశాల హెచ్ఎం ఆర్. నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో...

అక్కిరెడ్డిపాలెం : అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కాంతం మాట్లాడుతూ నేటి బాలలను రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. రవిచంద్, మహ్మద్ ఇస్మాయిల్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు కొండయ్య వలసలో ఉన్న శ్రేయ ఫౌండేషన్ దివ్యాంగుల పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. జననీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విందుల వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దివ్యాంగులకు బెడ్‌షీట్లు, టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి ఉషాదేవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేపగుంటలో..

వేపగుంట : జీవీఎంసీ 93వ వార్డు ఆర్ఆర్‌వీ పురంలో ఉన్న ఆక్స్‌ఫర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హర్షలత చిరంజీవి, హెచ్ఎం విజయకుమార్, కోఆర్డినేటర్ జీవీఏఎస్ భగవాన్ పాల్గొన్నారు.

మల్కాపురంలో..

మల్కాపురం: స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో బాలల దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద పిల్లలను ఆదుకునేందుకు చారి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలల దినోత్సవం నాడు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞానగనులని, వీటిని వినియోగించుకుని యువత జ్ఞానాన్ని పెంచుకోవాలని నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో లభ్యమవుతాయని అన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సమాచారం గ్రంథాలయాల్లోనే లభ్యమవుతుందన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి: పెందుర్తి మండల శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను డీఆర్‌సీ మాల్ అధినేత దాడి రమణచిట్టి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. బాలల దినోత్సవం సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేగి దివాకర్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. అంతకుముందు సంగీత విద్వాంసురాలు కొత్తపల్లి భానుమతి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం పలువురు పాఠకులు గ్రంథాలయ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

అగనంపూడి: గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు జ్ఞానాన్ని పెంచు కోవాలని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి అన్నారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ముందుగా భారత ప్రజా గ్రంథాలయ ఉద్యమ పితా మహుడు అయ్యంకి వెంకటరామణయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు.

సింధియా న్యూకాలనీ గ్రంథాలయంలో

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు హిందుస్థాన్ షిప్‌యార్డు న్యూకాలనీలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొని ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వెసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు.



పెందుర్తి: సరస్వతి విగ్రహానికి వందనం చేస్తున్న దృశ్యం

గోపాలపట్నంలో..

గోపాలపట్నం : దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతి వేడుకలు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని జరిపారు. గ్రంథాలయాధికారి నరసింహం, కమిటీ సభ్యులు నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడీ

కార్మికుడికి రూ. 400, మధ్యవర్తికి రూ. 200

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఇటీవల కాలంలో చాలా మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించిన విషయం తెలిసిందే. అయితే కొన్ని విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల కొరత ఎక్కువగా ఉన్నది. దీంతో ఆయా విభాగాల కాంట్రాక్టర్‌లు బయట నుంచి కొంత మంది కార్మికులను రోజువారి కూలికి తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారు. ప్లాంట్‌లో అయితే స్కిల్డ్, అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులుగా విభజించి వేతనాలు ఇచ్చేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా రోజువారి కూలీ పద్ధతిలో బయట నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. రోజుకు రూ.600 కార్మికులకు ఇస్తున్నామని ఉక్కు అధికారులకు కాంట్రాక్టర్లు చెబుతున్నట్టు సమాచారం. అయితే కూలీలకు కేవలం రూ.400 వందలు ఇచ్చి మిగతా రూ.200 మధ్యవర్తులు తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కొంత మంది కూలీలు రోజుకు రూ.400 ఇస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ముఖ్యమైన విభాగాల్లో అనుభవం కలిగిన కాంట్రాక్టు కార్మికులను తొలగించి, ఎటువంటి అనుభవం లేని కార్మికులను బయట నుంచి తీసుకురావడం వల్ల ప్లాంట్‌లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇంటక్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వంశీకృష్ణ తెలిపారు. అనుభవంలేని కార్మికులను ప్లాంట్‌లోకి అనుమతించరాదని. దీని వల్ల కార్మికుల భద్రతతో పాటు సంస్థకు ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గాజువాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గం పరిధిలోని వార్డుల్లో ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్లు అత్యధికశాతం నిరుపయోగంగా మారాయి. ముఖ్యంగా ఈ మరుగుదొడ్లను మురికివాడలు, పేద వర్గాలు నివాసముండే ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో నిర్మించారు. కొత్తలో రెండు మూడేళ్లు వినియోగించారు. కాలక్రమేణ ట్యాంకులు నిండిపోవడం, నీరు సదుపాయం లేకపోవడం, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో వినియోగానికి దూరమయ్యాయి. దీంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి పట్టిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు మరుగుదొడ్లకు వెళ్లలేని పరిస్థితిలో అవి ఉన్నాయి. నియోజకవర్గంలో సుమారు 90శాతం పైగా మరుగుదొడ్లు మూతపడ్డాయి. అంతేకాకుండా వీటి నుంచి దుర్వాసన వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గోతులమయంగా అయ్యప్పనగర్ రహదారి



గుంతలు ఏర్పడి రాళ్లు తేలిన రోడ్డు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు అయ్యప్పనగర్ రహదారి, షీలానగర్ రహదారి గోతులమయంగా మారా యి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి నుంచి అయ్యప్పనగర్ మీదుగా షీలానగర్‌కు వెళ్లే రహదారిలో ప్రయాణమంటే వాహనదారులు హడలిపోతున్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నాదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి వెళ్లే రహదారి కూడా పలు చోట్ల గోతులు పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కాన్వెక్స్ మిర్రర్‌ను పగలగొట్టిన ఆకతాయిలు

గోపాలపట్నం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రాకపోకల సౌకర్యార్థం చంద్రనగర్ అండర్‌పాస్ వద్ద ఏర్పాటు చేసి న కాన్వెక్స్ మిర్రర్‌ను ఆకతాయిలు పగలగొ ట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నరు.

'ఉక్కు'లో రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

» అధికారుల హెచ్చరికలు జారీ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో రోడ్డు భద్రతపై యాజమాన్యం కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. రహదారి నిబంధనలను తప్పకుండా పాటించేలా అధికారులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. ప్లాంట్ లోపల వాహనాలు కేవలం ముప్పై కిలోమీటర్ల వేగంతో వెళ్లాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వాహనదారులకు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ఉద్యోగుల భద్రతపై రహదారి నియమాలు కఠినంగా అమలు చేయాలని యాజమాన్యం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మధుమేహంపై అవగాహన

అగనంపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహం పట్ల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపీకృష్ణ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం వస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు. .

బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం పై సంబరాలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో పాత కర్ణవానివాలెంలో పార్టీ స్థానిక కార్యకర్తలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాజువాక ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలతో పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంపై ఉన్న నమ్మకాన్ని ఈ విజయం ఒక నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడా పోటీలకు కణితి హైస్కూల్ విద్యార్థులు



క్రీడాకారులతో కణితి హైస్కూల్ హెచ్ఎం ఎం.నరసింగరావు

కూర్మన్నపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16, 17 తేదీలలో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో జరగనున్న 69వ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల బేస్ బాల్ టోర్నమెంట్‌కు కణితి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎం.హేమదుర్గ, కె.శ్రీను ఎంపికైయారు. అలాగే ఏలూరులో జరిగే అండర్-19 బాలురు, బాలికల రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జి.రాకేశ్, జి.కల్యాణి, ఈ.ఎర్రమ్మ, వై.గీతా గౌతమ్ ఎంపికైయారు. ఈ విద్యార్థులను హెచ్ఎం నరసింగరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సంరద్భంగా విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడిని హెచ్ఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాచలం డిపో ఎదుట కార్మికుల ధర్నా

వేపగుంట నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఉద్యోగులు సింహాచలం డిపో ఎదుట శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. ఈ సంరద్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పని గంటలు పెంపు, స్త్రీశక్తి పథకం అమల్లో లోపాలు, అక్రమ తొలగింపులు ఆపాలని, సిబ్బంది నియామకం చేపట్టాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతినిధుల ప్రవేశం..







మెటల్ డిటెక్టర్‌తో చెకింగ్



ప్రాంగణంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సదస్సు సూపర్ సక్సెస్



ప్రధాన వేదిక నుంచి అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప రాష్ట్రపతి రాధా కృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్



విదేశీ ప్రతినిధితో సీఎం కరచాలనం, చిత్రంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



పారిశ్రామిక ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చర్చలు



సదస్సు వద్ద ఎంపీ శ్రీభరత్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్



స్టాల్స్‌లో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్



సదస్సు ప్రాంగణంలో పారిశ్రామిక ప్రతినిధులు



పెట్టుబడులపై ప్రతినిధుల చర్చలు



అరకు కాఫీ రుచిని ఆస్వాదిస్తున్న అతిథులు



స్టాల్స్‌లో ఆహారపదార్థాలను రుచి చూస్తూ...



వివిధ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ప్రతినిధులు



సదస్సులో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు



సదస్సు ప్రాంగణంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, తదితరులు

దిగ్గజాలకు 'కళా' స్వాగతం



గిరిజన సంప్రదాయ థింసా నృత్యంలో మంత్రులు సవిత, సంధ్యారాణి



కళాకారుల కొమ్ము నృత్యం

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) వ్యాపార భాగస్వామ్య సదస్సు-2025 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏయూ నీరింగ్ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన సదస్సులో 40 దేశాల నుంచి సుమారు మూడు వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. వ్యాపార దిగ్గజాలు, డెలిగేట్స్‌కు వేదిక ప్రవేశం వద్ద రాష్ట్రంలోని కళాకారులు సంప్రదాయ కళలతో స్వాగతం పలికారు. అరకు గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం అలరించింది. మంత్రులు గుమ్మడి సంధ్యరాణి, సవిత గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యంతో సందడి చేశారు. భద్రాచలం కళాకారులు కొమ్ముతో తయారుచేసిన వాయిద్యంతో కొమ్ముబూర సంగీతం వినిపించగా విదేశీయులు కళాకారులతో ఫొటోలు దిగారు. అమలాపురం కళాకారులు ప్రాచీన జానపద నృత్యాలతో అలరించారు.



బ్యాటరీ వాహనంలో ప్రతినిధులను తరలిస్తున్న దృశ్యం

నిర్వహణ అదుర్స్... వసతులు శభాష్!

మద్దిలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సులో డెలిగేట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత మెరుగైన వసతులు కల్పించింది. ఏయూ రోడ్డులో వేదిక వద్దకు వెళ్లడానికి 200 మీటర్ల ముందే డెలిగేట్స్ వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది హాల్స్, మూడు ప్రవేశమార్గాలు ఏర్పాటు చేశారు. ప్రవేశ మార్గంవరకు డెలిగేట్స్ నడిచివెళ్లకుండా బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచారు. సదస్సుకు వచ్చే వారి కోసం ఫైవ్‌స్టార్ స్థాయిలో వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. సిబ్బంది నిరంతరం పరిశుభ్రంగా ఉంచారు. పొగ సేవించే వారి కోసం అక్కడే స్మోకింగ్ జోన్ కేటాయించారు. డెలిగేట్స్ ఆహారం విషయంలోను ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. డెలిగేట్స్, మీడియా, అధికారులు ఇలా మూడు విభాగాలుగా విభజించి, అనేకరకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు.



ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద పారిశ్రామికవేత్తలు

టెక్స్‌టైల్స్‌లో రూ.4,500 కోట్లు పెట్టుబడి



టెక్స్‌టైల్స్ రంగంలో రూ.4,500 కోట్లు పెట్టుబడులు పెట్టడానికి 6 ఎంవోయూలు చేసుకున్నాం. తద్వారా 8 వేల మందికి ఉపాధి లభిస్తుంది. పరిశ్రమలు ఏర్పాటైతే ఉపాధితో పాటు ఆప్రాంత అభివృద్ధి జరుగుతుందని చంద్రబాబు దేశాలు, వీధులు తిరిగి పరిశ్రమలు తీసుకొచ్చారు. ఇదీ పరిశ్రమల పండుగ. చంద్రబాబు అభివృద్ధి, పరిశ్రమల సృష్టికర్త. ఎన్నికల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం. గత ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడమే చేసింది. కల్తీ నెయ్యి, కల్తీ మద్యం, రప్ప రప్ప నరకడమే వైసీపీ విధానం.

– ఎస్.సవిత, చేనేత, జౌళి, వెనుకబడిన తరగతుల శాఖా మంత్రి

రాష్ట్రానికి పెట్టుబడుల వరద



సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తోంది. నమ్మకం ఉన్న నాయకుడు కాబట్టే లక్షల కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. గత ఐదేళ్లలో గిరిజనులకు పిడికెడు మట్టి వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం. రహదారులు నిర్మిస్తున్నాం. డోలీ మోతలు లేకుండా చూస్తున్నాం. పవన్ కల్యాణ్, మోదీ మద్దతుతో కూటమి ప్రభుత్వంలో అద్భుతాలు జరుగుతున్నాయి.

– గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి

ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో రష్యన్ ప్రతినిధుల ఎంవోయూ



ఒప్పందపత్రాలు చూపిస్తున్న ప్రతినిధులు

కంచరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో భాగంగా శుక్రవారం రష్యా పతినిధులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో ఎంవోయూ చేసుకున్నారు. రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ గుమ్మల గణేష్‌కుమార్ సమక్షంలో రష్యాలోని పెరవోరస్కీ మెటలర్జికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.వోల్గా ఫెలిక్సోవ్నా, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రత్నకుమార్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. మెటలర్జీ డిప్లొమా చేసిన విద్యార్థులకు మూడు నెలల ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చి,రష్యా పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించే అంశంలో ఇరువర్గాల మధ్య ఒప్పందం జరిగింది.

ఘనంగా ప్రారంభమైన నెరెడ్కో ప్రాపర్టీ షో



నెరెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపీ శ్రీభరత్, మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి, శిరీష తదితరులు

పెదవాల్తేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో శుక్రవారం నెరెడ్కో ప్రాపర్టీ షో 2025 ఘనంగా ప్రారంభమయింది. మూడు రోజులు జరిగే షోను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపీ శ్రీభరత్, రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం అభివృద్ధి చెందుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో చీకటి రోజులు నెలకొని, రియల్ ఎస్టేట్ పూర్తిగా కుదేలై పోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్‌కు మంచి రోజులు వచ్చాయన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి అందరూ కలిసి రావాలన్నారు. రాష్ట్రంలో తుఫాన్ వచ్చినా రాజకీయం చేశారని, అలాంటి నాయకులు మనకు అవసరమా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు. విశాఖలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే రాష్ట్రానికి ఆదాయం లభిస్తుదన్నారు. బీచ్ రోడ్డును ఫ్రీజోన్ చేయాలన్నారు. గూగుల్ విశాఖకు రావడం గర్వంగా ఉందన్నారు. అనంతరం విశిష్ట అతిథులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో నెరెడ్కో పాత్ర అత్యద్భుతమని, పటిష్ట నిర్మాణాలు, పెట్టుబడికి తగ్గ గృహ సముదాయాలను, స్థలాలను అందించడంలో నెరెడ్కో ఎప్పుడూ ముందుండి, ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలని కోరారు. అనంతరం నిర్వాహకులు హరిబాబు మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి గాంచిన రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు ఒకేచోట తమ వెంచర్లను ప్రదర్శించడం, విక్రయించడం, అవసరమైతే రుణా లు మంజూరు చేయించడం వంటి కార్యక్రమాలకు ప్రాపర్టీ షోలో చోటు కల్పించామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస రావు, గౌతు శిరీష, పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, టీడీపీ నేత చోడే వెంకటపట్టాభిరామ్, నిర్వాహకులు హరిబాబు, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయాలి

» కేంద్ర సామాజిక న్యాయం- సాధికారత మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్





సదస్సులో పాల్గొన్న వక్తలు (ఇన్‌సెట్‌లో) వర్చువల్‌గా ప్రసంగిస్తున్న అమిత్ యాదవ్

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శాలను 21వ శతాబ్దంలో పూర్తిస్థాయిలో సాకారం చేయాలని కేంద్ర సామాజిక న్యాయం- సాధికారత మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ అన్నారు. ఏయూ ఐఐఎం-వి క్యాంపస్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ అంబేద్కర్ చైర్ల జాతీయ సదస్సుకు ఆయన వర్చువల్ విధానంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం కేవలం సంక్షేమానికి పరిమితం కాదని, సాధికారత, విద్య, తదితర అంశాల్లో సమానత్వం కలిగి ఉంటుందన్నారు. రాజ్యాంగం ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంబేద్కర్ ఆదర్శాలు పూర్తిగా అమలు చేసే దిశగా దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైర్‌ల జాతీయ ఆన్‌లైన్ పోర్టల్‌ను అమిత్ యాదవ్ ఆవిష్కరించారు. ఇది జ్ఞానం, డేటా నిధిగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏయూ డాక్టర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ డెవలప్ చేశారన్నారు. వీడీఎం-ఇండియా ఆన్ ద మూవ్ చైర్మన్ అజిత్ ఆచార్య, అంబేద్కర్ చైర్ మెంబర్ సెక్రటరీ వి.అప్పారావు, అంబేద్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ మనోజ్ తివారీ తదితరులు పాల్గొన్నారు.